# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 219 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శుక్రవారం 7 నవంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### రూ. 49,456 కోట్ల లాభాలను నమోదు చేసిన పీఎస్‌బీలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ బ్యాం కులు(పీఎస్‌బీ) రికార్డు స్థాయిలో లాభాలను సాధించాయి. మొత్తం 12 పీఎస్‌బీల్లో రెండు మాత్రమే క్షీణతను చూశాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల ప్రకారం, సమీక్షించిన త్రైమాసికంలో పీఎస్‌బీలు రూ. 49,456 కోట్ల లాభాలను నమోదు చేశాయి.

### జూలై-సెప్టెంబర్‌లో 19 శాతం పెరిగిన ఇళ్ల ధరలు

దేశవ్యాప్తంగా ప్రధాన ఎనిమిది నగరాల్లో ఇళ్ల ధరలు గణనీయంగా పెరిగాయి. అధిక డిమాండ్ కారణంగా ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ధరలు 7-19 శాతం పెరిగినట్టు కన్సల్టెంట్ సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం టాప్-8 నగరాల్లో ధరల వివరాలను ప్రాప్‌టైగర్ విడుదల చేసింది. డేటా ప్రకారం, దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ధరలు అత్యధికంగా 19 శాతం పెరిగాయి. లగ్జరీ ఆస్తులకు, మౌలిక సదుపాయాలకు గిరాకీ



## లోకల్ బాడీ ఎన్నికలు
# ఇద్దరు నిబంధన రద్దుకు గవర్నర్ ఆమోదం

- ‘ఇద్దరు పిల్లల’ నిబంధనను ఎత్తివేస్తూ ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
- మరోవైపు.. పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంపై హైకోర్టు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది
- ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018, పురపాలక చట్టం 2019లను సవరిస్తూ ఆర్డినెన్స్ జారీకి గత నెల 23న జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీర్మానించింది
- రాజ్యాంగంలోని అధికరణ 243(ఇ) ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఎన్నికల సంఘం ప్రభుత్వ నిర్ణయం కోసం ఎందుకు ఎదురుచూస్తోందని ప్రశ్నించింది

**హైదరాబాద్**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉన్న ‘ఇద్దరు పిల్లల’ నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు కూడా ఇకపై స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం లభించింది. మరోవైపు.. పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించక పోవడంపై హైకోర్టు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి ఉన్న ‘ఇద్దరు పిల్లల’ నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆయన సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నేడు అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది, దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు మార్గం సుగమం అవుతుంది. భారతదేశంలో కుటుంబ నియంత్రణ చర్యలను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు స్థానిక సంస్థలు (గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ), పురపాలక సంఘాల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా పేర్కొంటూ ఉమ్మడి రాష్ట్రంలో 1994లో ఒక చట్టాన్ని - మిగతా3లో


## జూబ్లీహిల్స్‌లో గ్రామస్థాయి అభివృద్ధి కూడా లేదు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సర్వేలపై కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపెవరిదో సర్వేల్లో తేలడం లేదన్న కిషన్ రెడ్డి
- రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని వ్యాఖ్య
- నియోజకవర్గ వెనుకబాటుకు బీఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలన్న కేంద్ర మంత్రి
- జూబ్లీహిల్స్ వెనుకబాటుకు బీఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలి
- గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు
- ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదు



**హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై సర్వేల్లోనూ స్పష్టత రావడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే విషయంలో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో - మిగతా3లో



### ఒక తరం భవితను నాశనం చేశారు

- 15 ఏళ్ల ఆటవిక పాలనలో.. ఎన్ని ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించారు?.. జీరో
- కోసి నదిపై ఎన్ని వంతెనలు నిర్మించారు?.. జీరో
- ఎన్ని పర్యాటక సర్క్యూట్‌లు అభివృద్ధి చేశారు?.. జీరో
- ఐఐటీ, ఐఐఎం కూడా జీరో'.. ఒక తరం భవిష్యత్తును ఆర్జేడీ నేతలు బుగ్గిపాలు చేశారు

## చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు



- ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని సూచన
- పార్టీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ ముఖ్య నాయకులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం లేకుండా కలిసికట్టుగా పని చేయాలని సూచన
- మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతో పాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. - మిగతా3లో



### ఛత్తీస్‌గఢ్‌లో ఒకే రైల్వే ట్రాక్‌పై మూడు రైళ్లు!

- బిలాస్‌పూర్‌లో ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రైళ్లు
- ఒక ప్యాసింజర్ రైలు, రెండు గూడ్స్ రైలు
- అప్రమత్తమై ఆపేసిన ప్యాసింజర్ రైలు లోకోపైలెట్



### పాకిస్థాన్ కు వ్యతిరేకంగా పీఓకేలో జెన్ జీ నిరసనలు

- విద్యార్థుల ఆందోళనతో ఉద్రిక్తత
- పీఓకేలో మరోసారి మొదలైన ఆందోళనలు
- ఈసారి విద్యార్థుల నేతృత్వంలో నిరసనలు
- అధిక ఫీజులు, డిజిటల్ మార్కింగ్ విధానంపై ఆగ్రహం
- నిరసనకారులపై కాల్పులతో హింసాత్మకంగా మారిన ఉద్యమం

## సెంటిమెంట్ అన్నిసార్లూ పనిచేయదు

- పీజేఆర్ విషయంలో బీఆర్ఎస్ సెంటిమెంట్ ఏమైందని కోమటిరెడ్డి ప్రశ్న
- జూబ్లీహిల్స్‌లో 30 నుంచి 50 వేల మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా
- ప్రభుత్వ పనితీరు చూసే ప్రజలు మద్దతిస్తున్నారని వెల్లడి



**జూబ్లీహిల్స్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సెంటిమెంట్ రాజకీయాలు అన్ని సమయాల్లో పనిచేయవని, ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేస్తారని ఆయన స్పష్టం చేశారు. 30 నుంచి 50 వేల ఓట్ల భారీ మెజార్టీతో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. “దివంగత నేత పీజేఆర్ చనిపోయినప్పుడు, ఆయన భార్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి మూడు గంటలు పట్టింది. అప్పుడు వారి సెంటిమెంట్ ఏమైంది? నిజంగా సెంటిమెంట్ పనిచేస్తే కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనే బీఆర్ఎస్ గెలిచి ఉండేది” అని అన్నారు. ప్రజలు సెంటిమెంట్‌ను నమ్మే స్థితిలో లేరని, ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వ పాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారని, కాంగ్రెస్ పార్టీకే తమ ఓటు అని స్పష్టంగా చెబుతున్నారని వివరించారు. “ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 20 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశాం. ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా ఆగిన ఈ ప్రక్రియ, ఎన్నికలు ముగియగానే తిరిగి ప్రారంభిస్తాం. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర - మిగతా3లో



### నాన్న ప్రధానిగా వస్తే.. ఆమె నిలదీసింది

- గుర్తుచేసుకున్న ప్రియాంక గాంధీ
- ప్రధానిమంత్రి అయిన తర్వాత మీరు మాకు కుళాయి ఏర్పాటు చేస్తానని
- ప్రధాని స్థానంలో ఉన్న ఆయన్ను ప్రజలు నేరుగా ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేది
- మన దేశ రాజకీయాలకు మహాత్మా గాంధీ పునాది వేశారు.

## సంపాదకీయం

# వలసలపై వితండవాదాలు!


వలసలపై అమెరికాలో ఇప్పుడు కొనసాగుతున్న వ్యతిరేకత చాలా చిత్రమైనది. నిజానికి వలసలపై వారి వైఖరి, ధోరణిపై అర్థమే లేదు. అమెరికన్లు అంతా ఇలాగే లేరు కాని, ప్రస్తుతం ఈ ధోరణిదే ఆధిపత్యం. వలసలపై మాట్లాడే చర్చించే నైతిక అర్హతలు ప్రస్తుతం అమెరికన్లుగా చలామణి అవుతున్న వారికి కనీస మాత్రంగా కూడా లేవు. చదువు, బతుకు దెరువు కోసం ఇతర దేశాలనుంచి అమెరికాకు వలస వచ్చిన విద్యార్థులు, యువతపై తీవ్రమైన వ్యతిరేకత, కోపం, ద్వేషం వ్యక్తం కావడం చాలా చిత్రమైన సంగతి. ఆశ్చర్యకరంగా ఇప్పుడు అధికారంలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ దొరవారు ఈ నినాదంపైనే గద్దెనెక్కారు. ఆయనతో సహా వలసలను వ్యతిరేకిస్తున్న వాళ్లు తన మూలాలు ఏమిటి అనే ప్రశ్న వేసుకుంటే వారి నోరు పెగిలే అవకాశం ఏమాత్రం లేదు. గొంతులో పచ్చి వెలక్కాయ పడిపోయి ఒక్కరికి కూడా మాటపెగలదు. 90 శాతానికి పైగా ప్రస్తుత అమెరికన్ పౌరుల మూలాలు అమెరికా భూభాగం వెలుపలివే. వీరెవ్వరు కూడా అమెరికా భూమి పుత్రులు ఎంత మాత్రంకారు. ఎక్కువగా యూరోపియన్ దేశాలకు చెందిన వీళ్ళ తాతలు, ముత్తాతలు ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ లాంటి యూరప్ దేశాలకు చెందిన వారు. దాదాపుగా వీళ్లంతా తెల్లతోలు కలిగిన ప్రజలే. ఆఫ్రికా నుంచి వచ్చిన నల్లతోలు ప్రజలు వారంతట వారుగా అమెరికాకు వచ్చిన వారు కాదు. బలవంతంగా తీసుకు రాబడిన వారే ఇప్పటి అమెరికన్ నల్లజాతీయులు. యూరప్ నుంచి అమెరికాకు వలస వచ్చిన తెల్లతోలు యూరోపియన్లు తమ వ్యక్తిగత సేవలు, ఆక్రమించిన వ్యవసాయ భూముల్లో వెట్టి కూలీలుగా పని చేయడానికి ఆఫ్రికా నుంచి బలవంతంగా బానిసలుగా తరలించబడిన వారే నల్లజాతీయులు. అసలైన భూమి పుత్రులు, నిజమైన అమెరికన్లు కేవలం రెడ్ ఇండియన్ల మాత్రమే. స్థానికులు, భూమి పుత్రులు అయిన ఈ రెడ్ ఇండియన్లు ఇప్పుడు అమెరికాలో కడు దయనీయ జీవితాలను వెళ్ల బుచ్చుతున్నారు. కేవలం కూలీలుగా, నాల్గవ తరగతి ఉద్యోగులుగా మాత్రమే వీళ్లు బతుకులను వెళ్లదీస్తున్నారు. వారి భూములు, అడవులను ఆక్రమించిన తెల్లతోలు యూరోపియన్లు మాత్రం ఆధిపత్యం చేస్తూ అమెరికన్లుగా చలామణి అవుతున్నారు. ఇప్పుడు అమెరికన్లుగా చలామణి అవుతున్న వారిలో 90 శాతం వాళ్లే. ఇలాంటి వారికి ప్రస్తుత వలసలను ప్రశ్నించే నైతిక అర్హత ఎలా ఉంటుంది? ఒక్కమాటలో చెప్పాలంటే వారిది గురివింద తన కింది నలుపును కనపడనీయకుండా దాచుకొని నేను ఎర్రని దాన్ని, అందమైన దాన్ని అని విర్రవీగే గురివింద నీతి మాత్రమే అవుతుంది. అలాంటి వలస మూలాలున్న తెల్లతోలు అమెరికన్లు ఇప్పుడు చదువు కోసం, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చిన విద్యార్థులు, యువతపై కారాలు, మిరియాలు నూరుతున్నారు. వారి ఉపాధికి అడ్డుపడుతున్నారు. భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారు. ఆ ధోరణిని రాజకీయ అస్త్రంగా మార్చుకున్న రిపబ్లికన్ పార్టీ నిన్నటి ఎన్నికల్లో ఏకంగా గద్దెనే స్వాధీనం చేసుకోగలిగింది. దీంతో ఇటీవల కాలంలో ఆ నేల వెలుపలి నుంచి అమెరికాకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు చాలా ఇబ్బందులకు లోనవుతున్నారు. నిజానికి అమెరికాలో ఉపాధి పొందగలుగు తున్నది అత్యంత ప్రతిభావంతులైన యువత మాత్రమే. స్థానిక అమెరికన్లు ఇతర దేశాల యువత ప్రతిభతో పోటీ పడలేని ఫలితంగానే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందగలుగుతున్నారనేది సత్యం. స్వయం కృషి, ప్రతిభలతో మాత్రమే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందే విదేశీ విద్యార్థులపై ఇలాంటి ధోరణి వ్యక్తం కావడం న్యాయమైతే కాదు. వ్యక్తమవుతున్న వలస వ్యతిరేక ధోరణి కారణంగా అమెరికా వెలుపల ఉన్న వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఎంతో మానసిక క్షోభకు లోనవుతున్నారు. అమెరికా వెళ్లడం చదువుకోవడం, ఉపాధి సంపాదించడం అంత సులభమైన పని ఏమీకాదు. ఎంతో ప్రయాసతో కూడుకున్నది. డబ్బుతో ముడిపడింది. అత్యంత ప్రతిభావంతులు మాత్రమే అక్కడికి వెళ్లడానికి అర్హులు. తమ తమ దేశాల్లో మంచి ర్యాంకులతో రాణించి, అవసరమైన ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తరువాత మాత్రమే అమెరికాకు వెళ్లే అనుమతి పత్రమైన వీసాను పొందగలుగుతారు. అంతేకాదు, ప్రతిభ మాత్రమే చాలదు. ఒక్కొక్క విద్యార్థి కనీస పక్షంగా రూ. 50 లక్షలు ఖర్చు చేయగలిగేతే తప్ప అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ (ఎమ్ఎస్) పొందలేరు. అలా పొందిన డిగ్రీతో అక్కడ ఉపాధి పొంది చదువు కోసం చేసిన రూ. 50 లక్షల అప్పును క్రమంగా తీర్చుకునే ప్రయత్నం చేస్తారు. అప్పు తీరిన తరువాత కొంత మెరుగైన జీవితాన్ని పొందగలుగుతారు. ఇలా అక్కడికి వెళ్లిన ప్రతిభావంతులైన యువత మేధో్శ్రమ ఫలితంగానే ప్రపంచంలోనే అత్యంత శక్తి వంతమైన ఆర్థికశక్తిగా ఎదిగింది. అమెరికన్ యువతలో మేధస్సు, ప్రతిభా సామర్థ్యాలు ఉండి ఉంటే విదేశీ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు రావు కదా. ఈ వాస్తవాన్ని పక్కన బెట్టి వలస వ్యతిరేక ప్రచారాన్ని మొదలు పెట్టింది అక్కడి తెల్ల తోలు అహంకారం. ఈ ధోరణి తోడుగా అధ్యక్ష దొరవారు చిత్రవిచిత్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవన్నీ విదేశీ యువతకు పెద్ద ప్రతిబంధకాలుగా మారిపోయాయి. ఈ వలస వ్యతిరేక ధోరణి ప్రబలిపోయిన ఫలితంగా ఉపాధి అవకాశాలు చాలా వరకు అడుగంటాయి. ట్రంప్ నిర్ణయాల ఫలితంగా ఇప్పుడు అమెరికాలో షట్ డౌన్ (ప్రభుత్వ ఆర్థిక కార్యక్రమాల్లో స్తంభన) నడుస్తున్నది. 35 రోజులుగా షట్ డౌన్ కొనసాగుతున్నది. షట్‌డౌన్ ఫలితంగా ఇప్పటికే ఎన్నో బిలియన్ల డాలర్లను అమెరికా కోల్పోయిందని అమెరికా ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనసాగుతున్న ట్రంప్ మూర? ధోరణి కారణంగా షట్‌డౌన్ ఇంకెన్నాళ్లు ఉంటుందో తెలియని అనిశ్చితి అమెరికాలో ఇప్పుడున్నది. ఈస్థితి ఇలాగే కొనసాగితే అమెరికా ఆర్థిక వ్యవస్థ త్వరలో కుప్పకూలిపోయే ప్రమాదం సైతం ఉంటుందని ప్రముఖ అంతర్జాతీయ పత్రికలు విశ్లేషిస్తున్నాయి. ఇప్పటికే ఆయన గద్దెపై కూర్చొని తొమ్మిది నెలలు గడిచిపోయాయి. మరో 40 నెలల పాటు ఆయనకు పాలనా అధికారం ఉంటుం ది. ఆయన తీరు ఇంకా ఇలాగే కొనసాగితే 250 యేళ్ల మేధస్సు, శ్రమల ఫలితంగా నిర్మించబడిన అమెరికా ఆర్థిక వ్యవస్థ పాలిట ట్రంప్ భస్మాసురుడిగా మారిపోతాడని కూడా అంటున్నారు. ఎంఎజిఎ/ మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్) నినాదం అర్థం లేనిదై పోవడం ఖాయం అని చెబుతున్నారు. వలస వెళ్లిన చోటు అమెరికా అయినా, యూరప్ దేశాలు అయినా, పెట్రోలియం వనరులు అధికంగా లభించే అరబ్ దేశాల్లోనైనా శ్రమించి నాలుగు డబ్బులు సంపాదించవలసిందే తప్ప మరోమార్గం మాత్రం లేదు. తాను ఉన్న చోట లభించే వేతనం కంటే కొంత మెరుగైన వేతనం, ఇంకొంత మెరుగైన జీవితం లభించే ప్రాంతానికి వలస వెళ్లడానికే ఏ మనిషిఅయినా మొగ్గుచూపుతాడు. దాన్ని తప్పుగా చూడడం, అభ్యంతరం వ్యక్తం చేయడం అనుచితం. మానవ సమాజాలు దేశాలుగా మారిన తరువాత ఏ దేశానికి ఆ దేశం కొన్ని నియమాలు, నిబంధనలు, పద్ధతులు, చట్టాలు ఏర్పరచుకున్నాయి. వాటిలో భాగమే వీసాల లాంటి అనుమతి పత్రాలు. అలాంటి అనుమతి పత్రాలను ఒక్కో దేశం ఒక్కో రీతిలో తమ తమ దేశాల అవసరాలకు అనుగుణంగా రూపొందించుకున్నాయి. తమ దేశ ఆర్థిక, సాంకేతిక అవసరాలను తీర్చుకునేందుకు ఇతర దేశాల పౌరులను రప్పించే, ఆకర్షించే అనేక ప్రయత్నాలను చాలా దేశాలు చేశాయి. అలా అనేక దేశాల మేధస్సును విస్తృతంగా ఆకర్షించింది అమెరికా. అలా అనేక దేశాల జాతుల ప్రజల రెండున్నర శతాబ్దాల నిరంతర శ్రమ, కృషి, మేధస్సుల వల్ల మాత్రమే నేటి అమెరికా నిర్మాణం సాధ్యమైంది. ప్రపంచం నలుమూలల నుంచి అనేక దేశాల ప్రజల వలసల శ్రమతో మాత్రమే ఆధునిక అమెరికా నిర్మాణం సాధ్యమైందనేది అందరూ అంగీకరించవలసిన సత్యం. నేటి అమెరికా అనేది ఎంతమాత్రం ఒక ఒకే ఒక్క జాతి సమూహం ఎంతమాత్రం కాదు. భిన్నజాతుల మిశ్రమం అయిన నానా జాతి సమితి లాంటి ఒక సంకరజాతి మానవ సమూహమే నేటి ఆధునిక అమెరికా. అలా అమెరికా ఒక గొప్ప దేశంగా మారిపోయింది.

# రాజకీయ అనుభవశాలి ఎన్‌జి రంగా



గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 – జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరి యన్ గానే కొనసాగారు. రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది. 1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు. ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు. 1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు. 1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు. 1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు. గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశిం చారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్ లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొర్కై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు. రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులో నూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నేషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు. నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీ య రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్య మాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు. రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమైన నీతివంతమైన రాజకీయాన్ని పాటించి,95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 8వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు.

# నిరంతర పరిశోధనే శాస్త్రమథనం



విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తిల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు.పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యురీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ ధైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్యమైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్ఠాత్మకమైన "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. 1987 ఫిబ్రవరి నుండి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారి తీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రో స్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.

# తన కాన్వాయ్‌పై ఆర్జేడీ మద్దతుదారులు దాడి చేశారు

**పాట్నా :** బీహార్‌లో తొలి దశ పోలింగ్ కొనసాగుతుండగా, లఖిసరాయ్ నియోజకవర్గంలో తన కాన్వాయ్‌పై ఆర్జేడీ మద్దతుదారులు దాడి చేశారని బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ఆరోపించారు. ఆర్జేడీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆటవిక రాజ్యం తప్పదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆయన అన్నారు.తన కాన్వాయ్‌పై చెప్పులు, ఆవు పేడ విసిరారని, రాళ్లతోనూ దాడి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జేడీ కార్యకర్తలు పోలింగ్ బూత్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఉప ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని విజయ్ కుమార్ సిన్హా మీడియాతో చెప్పారు.ఈ ఉదయం అదే నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న విజయ్ సిన్హా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు, ఈ పరిణామంపై ఎన్నికల సంఘం స్పందించింది. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాష్ట్ర డీజీపీని ఆదేశించినట్లు ఈసీ అధికారులు వెల్లడించారు.



**జంగల్ రాజా పరిపాలను వద్దు**

బీహార్ ఎన్నికల సందర్భంగా అరారియాలో జరిగిన ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. మహా కూటమిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి దేశ భద్రత గురించి మాత్రమే కాకుండా దాని విశ్వాసం గురించి కూడా ఎటువంటి ఆందోళన లేదని ఆయన అన్నారు. మన సంస్కృతి, విశ్వాసాన్ని అగౌరవ పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీహార్ ఎన్నికల సందర్భంగా అరారియాలో జరిగిన ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. మహా కూటమిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి దేశ భద్రత గురించి మాత్రమే కాకుండా దాని విశ్వాసం గురించి కూడా ఎటువంటి ఆందోళన లేదని ఆయన అన్నారు. మన సంస్కృతి, విశ్వాసాన్ని అగౌరవపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ పేరు చెప్పకుండానే, కాంగ్రెస్ నాయకులు బీహార్‌కు వచ్చి ఛఠీ మైయా పూజను డ్రామా అని పిలుస్తారని ప్రధాని మోదీ అన్నారు. ఇది ఛఠీ మైయాను అవమానించడం కాదా? ఇది మన విశ్వాసాన్ని అవమానించడమే అన్నారు. ఇలాంటి విషయాలు చెప్పినప్పుడు, ఆర్జేడీ ఎందుకు మౌనంగా ఉంటుంది. కుంభమేళా సమయంలో స్నానం చేయడాన్ని ఇదే కాంగ్రెస్ నాయకులు ఎగతాళి చేసేవారని ప్రధాని మోదీ అన్నారు. రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తారు. వారికి రాముడిపై నమ్మకం లేదు. వారికి విశ్వాసం లేదు. రామ్‌లాల ప్రాణ ప్రతిష్ఠకు హాజరు కాలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు రాముడిని ద్వేషిస్తారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. "రాముడి ఆలయం ఎక్కడ నిర్మించామో, అక్కడ నిషాద్ రాజ్ కు కూడా ఒక ఆలయం ఉంది. వాల్మీకికి కూడా ఒక ఆలయం ఉంది. మాతా శబరికి కూడా ఒక ఆలయం ఉంది. రాముడిపై కోపం ఉంటే, వారి వద్దకు వెళ్లకండి, కానీ కనీసం ఇతర ప్రదేశాలకు అయినా వెళ్లండి" అని ప్రధాని మోదీ హితబోధ చేశారు.బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, "ఈరోజు మొదటి దశ పోలింగ్ జరుగుతోంది. బీహార్ అంతటా సోషల్ మీడియాలో అద్భుతమైన చిత్రాలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలు ఏర్పడుతున్నాయి. బీహార్ యువతలో అపూర్వమైన ఉత్సాహం ఉంది. ఇంకా ఓటు వేయని వారు, ఇళ్లను వదిలి బయటకు రాని వారు వీలైనంత త్వరగా ఓటు వేయాలని వినయంగా అభ్యర్థిస్తున్నాను. బీహార్ అంతటా ఒకే గొంతు ప్రతిధ్వనిస్తుంది.. అదే ఎన్డీఏ ప్రభుత్వం మరోసారి " అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 1990 నుండి 2005 వరకు 15 సంవత్సరాలు "జంగల్ రాజ్" బీహార్‌ను పాలించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. "జంగల్ రాజ్" బీహార్‌ను నాశనం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడపడం పేరుతో, బీహార్ ప్రజలను దోచుకున్నారు. ఆ 15 సంవత్సరాల జంగిల్ రాజ్ కాలంలో బీహార్‌లో ఎన్ని ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించారు? సున్నా." అని అన్నారు. " కొన్ని రోజుల క్రితం, కాంగ్రెస్ ? ఆర్జేడీ వైరాన్ని బయటపెట్టాను. కాంగ్రెస్ తన ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిని ఆర్జేడీకి వ్యతిరేకంగా నిలబెట్టింది. వారు మీడియా ఇంటర్వ్యూలు ఇస్తూ ఆర్జేడీ జంగిల్ రాజ్‌ను బయటపెడుతున్నారు. ఈ జంగిల్ రాజ్ కింద దళితులు, మహాదళితులు, చాలా వెనుకబడిన వర్గాలు ఎక్కువగా నష్టపోయాయని చెబుతున్నారు. ఎన్నికలు ఇప్పుడే జరిగాయి. ఫలితాలు వెలువడే నాటికి, వారు ఒకరినొకరు గొడవలతో విడిపోతారు." అని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు.

# ముఖ్యమంత్రి మార్పు వార్తలపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన డీకే శివకుమార్!

కర్నాటకలో గత కొద్దికాలంగా ముఖ్యమంత్రి మార్పుపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. త్వరలోనే డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. నవంబర్‌లో విప్లవం పేరుతో వస్తున్న ఊహాగానాలను కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్‌లో విప్లవం ఉండదని.. 2028లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. తాను పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుడినని.. సీఎం సిద్ధరామయ్యతో కలిసి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్నారు. ఇటీవల సీఎం మార్పు జరిగే అవకాశం ఉందని.. దీన్ని కొందరు నవంబర్ విప్లవం అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ.. తాను ఎవరినీ కలవబోవడం లేదని.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఎలాంటి చర్చ జరుగలేదన్నారు. ఇది ముఖ్యమంత్రి హక్కని.. పార్టీ ఏది నిర్ణయించినా అదే జరుగుతుందన్నారు. పార్టీ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని చెబితే.. ఆయన అలాగే ఉంటారని.. ఆయన పదేళ్లు, పదిహేనేళ్లు ఉండాలనుకుంటే అన్ని సంవత్సరాలు కొనసాగుతారన్నారు. మీడియాలో వస్తున్న ఊహాగానాలను ఆయన తోసిపుచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో విప్లవం రాదని.. 2028లో కాంగ్రెస్ తిరిగి వచ్చినప్పుడు ఆ విప్లవం జరుగుతుందన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ప్రశ్నించగా.. ఢిల్లీ హైకమాండ్ దీనిపై



నిర్ణయం తీసుకుంటుందని శివకుమార్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల సిద్ధరామయ్య ఇటీవల తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తానని, అయితే తుది నిర్ణయం పార్టీదేనని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత.. సీఎం పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ పోటీపడ్డ విషయం తెలిసిందే. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ చెరో రెండున్నరేళ్లు సీఎంగా కొనసాగే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి.

# పాకిస్థాన్ కు వ్యతిరేకంగా పీఓకేలో జెన్ జీ నిరసనలు

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. గత నెలలో పన్నులు, సబ్సిడీల కోసం జరిగిన హింసాత్మక ఆందోళనలు సద్దుమణగక ముందే.. ఇప్పుడు విద్యార్థులు రోడ్డెక్కారు. విద్యా సంస్కరణలు, అధిక ఫీజులకు వ్యతిరేకంగా 'జెన్–జీ' యువతరం ప్రారంభించిన ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో స్థానికంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ముజఫరాబాద్‌లోని విశ్వవిద్యాలయాల్లో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. సెమిస్టర్ ఫీజుల పేరుతో ప్రతి 3–4 నెలలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ అసెస్‌మెంట్ సిస్టమ్ (ఈ–మార్కింగ్) వల్లే అక్టోబర్ 30న విడుదలైన మొదటి సంవత్సరం ఫలితాల్లో తమకు ఊహించిన దానికంటే తక్కువ మార్కులు వచ్చాయని వారు మండిపడుతున్నారు. కొందరైతే పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు కూడా పాస్ అయ్యారని ఆరోపించడం గమనార్హం. శాంతియుతంగా జరుగుతున్న ఈ నిరసనలు ఇటీవల హింసాత్మకంగా మారాయి. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరపడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహించిన విద్యార్థులు టైర్లకు నిప్పుపెట్టి, విధ్వంసానికి పాల్పడ్డారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ పరిణామాలు ఇటీవల నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన విద్యార్థి ఉద్యమాలను గుర్తుచేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనలతోనే షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. ఈ ఏడాది నేపాల్‌లోనూ విద్యార్థి



ఉద్యమ తీవ్రతకు కేపీ ఓలీ సర్కారు రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం పీఓకేలో యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి రావడం షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పిగా మారింది. ఇప్పటికే ప్రధాని షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఆందోళనలు ఎలాంటి మలుపు తీసుకుంటాయోనన్న ఆసక్తి నెలకొంది.

## అతను పాకిస్థాన్ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంత

### పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్ర వ్యాఖ్యలు

**న్యూ ఢిల్లీ :** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ పై ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మునీర్.. పాకిస్థాన్ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంత అని, మానసికంగా స్థిరత్వం లేని వ్యక్తి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2023 ఆగస్టు నుంచి అదియాలా జైలులో ఖైదీగా ఉన్న ఇమ్రాన్ ఎక్స్ వేదికగా ఈ ఆరోపణలు చేశారు.మునీర్ పాలనలో అణచివేత గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని, అధికార దాహంతో కళ్లుమూసుకుపోయిన ఆయన దాని కోసం ఎంతకైనా తెగిస్తారని ఇమ్రాన్ ఖాన్ దుయ్యబట్టారు. నవంబర్ 26 మే 9న మురిడ్కే ఘటనలను ప్రస్తావిస్తూ.. ఇవి అధికార దుర్వినియోగానికి స్పష్టమైన ఉదాహరణలని విమర్శించారు. పోలీసులు, భద్రతాసిబ్బంది తమ పార్టీ కార్యకర్తలను హత్య చేశారని ఆరోపించారు.నిరాయుధులైన పౌరులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం ఏ నాగరిక సమాజంలోనూ ఊహించలేమని ఖాన్ అన్నారు. మహిళలపై ఇంతటి క్రూరత్వం గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. తన భార్య బుష్రా బీబీని ఏకాంత నిర్బంధంలో ఉంచి అసీమ్ మునీర్ వేధిస్తున్నారని ఆరోపించారు. బానిసత్వంలో బతకడం కంటే మరణమే మేలని వ్యాఖ్యానించారు. అసిమ్ మునీర్ తనపై, తన భార్యపై అన్ని రకాల అన్యాయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఏ రాజకీయ నాయకుడి కుటుంబం కూడా ఇంతటి క్రూరత్వాన్ని ఎదుర్కోలేదని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఎన్ని చేసినా సరే తాను తలవంచను, లొంగిపోను అని మరోసారి స్పష్టం చేయాలనుకుంటున్నా అని తేల్చి చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంతో సయోధ్యకు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని కీలుబొమ్మ ప్రభుత్వంతోగానీ, సైనిక నాయకత్వంతోగానీ తమ పార్టీ చర్చలు జరపదని అన్నారు.

## ఒక తరం భవితను నాశనం చేశారు



**పట్నా:** 'బిహార్‌లో 15 ఏళ్ల ఆటవిక పాలనలో.. ఎన్ని ఎక్స్‌ప్రెస్‌వేలు నిర్మించారు?.. జీరో. కోసి నదిపై ఎన్ని వంతెనలు నిర్మించారు?.. జీరో. ఎన్ని పర్యాటక సర్క్యూట్‌లు అభివృద్ధి చేశారు?.. జీరో. యువతకు ఎన్ని క్రీడా సముదాయాలు నిర్మించారు?.. జీరో. ఎన్ని వైద్య కళాశాలలు వచ్చాయి?.. జీరో.. ఐఐటీ, ఐఐఎం కూడా జీరో'.. ఒక తరం భవిష్యత్తును ఆర్జేడీ నేతలు బుగ్గిపాలు చేశారు'.. అని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అరారియా(బీహార్)లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పేర్కొన్నారు. ఇప్పుడు బిహార్‌లోని అన్నివైపుల నుంచి ఒకే ఒక మాట వినిపిస్తున్నదని అది 'మరోమారు ఎన్డీఏ సర్కార్' అని అన్నారు. మొదటి దశ పోలింగ్‌లో బీహార్ ఓటర్లు అభివృద్ధి కోసం ఓటు వేస్తారని, చొరబాటుదారులను గుర్తించి, వెనుకను పంపుతారన్నారు. ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమి.. చొరబాటుదారులను అక్రమంగా భారత పౌరులుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని ప్రధాని ఆరోపించారు. ఆర్జేడీ జంగిల్ రాజ్.. బిహార్‌పై దాడి చేసిందని, జంగిల్ రాజ్ అంటే. పిస్టల్, క్రూరత్వం, అవినీతి దుర్మార్గపు పాలన అని అన్నారు. తొలి దశ ఓటింగ్ గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు మూలల నుండి సోషల్ మీడియాలో పలు ఫొటోలు వస్తున్నాయని అన్నారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద పొడవైన క్యూలు కనిపిస్తున్నాయని, మహిళలు ఓటు వేసేందుకుపెద్ద సంఖ్యలో వస్తున్నారన్నారు. బిహార్ యువతలో ఉత్సాహంతో ఉందన్నారు. ఓటర్లంతా ఓటు వేయాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు.

## నాన్న ప్రధానిగా వస్తే.. ఆమె నిలదీసింది



కాంగ్రెస్ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తన తండ్రి రాజీవ్ గాంధీ అందరికీ అందుబాటులో ఉండేవారని, ప్రధాని స్థానంలో ఉన్న ఆయన్ను ప్రజలు నేరుగా ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేదని అన్నారు. అందుకు తన చిన్ననాటి సంఘటనను గుర్తుచేసుకున్నారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ.. "అప్పుడు నాకు 10–12 ఏళ్లు ఉంటాయి. అమేఠీలో ఒక మహిళ నా తండ్రిని నిలదీసింది. 'ప్రధానిమంత్రి అయిన తర్వాత మీరు మాకు కుళాయి ఏర్పాటు చేస్తానని చెప్పారు. మీరు ఇంకా దానిని ఏర్పాటు చేయలేదు. మేం మీకు మళ్లీ ఓటేయబోం' అని స్పష్టంచేసింది. ఒక దేశ ప్రధానితో ఒక గ్రామంలో ఉన్న మహిళ అలా మాట్లాడింది. అలా మాట్లాడుతున్నందుకు ఆమె ఏమాత్రం భయపడలేదు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరు భయపడాల్సిన పరిస్థితి. మీరు మీ హక్కుల గురించి ప్రశ్నిస్తే పోలీసులు మిమ్మల్ని కొడతారు. అధికారులు మీ నోరు మూయిస్తారు. కానీ ఆ రోజుల్లో అలా లేదు. మన దేశ రాజకీయాలకు మహాత్మా గాంధీ పునాది వేశారు. అందులో ప్రజలే సుప్రీం" అని పేర్కొన్నారు. ఇప్పుడు బిహార్ ఎన్నికలు ఎలాంటి అవకతవకలు లేకుండా జరిగితే ఎన్డీయే అధికారాన్ని కోల్పోతుందన్నారు తన సోదరుడు రాహుల్ గాంధీ చేస్తోన్న ఓటు చోరీ ఆరోపణలను ఆమె పునరుద్ఘాటించారు. బిహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించారని, హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లను అదనంగా జోడించారని విమర్శించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఒకే రైల్వే ట్రాక్‌పై మూడు రైళ్లు!



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్?లో ఒకే ట్రాక్‌పై మూడు రైళ్లు రావడంతో అక్కడ ఉన్నవారంతా భయాందోళనలకు గురయ్యారు. కొన్ని రోజుల క్రితం ఇదే రాష్ట్రంలో గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొన్న ఘటనలో లోకోపైలట్‌తో సహా 11 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి రావటం కలవరపాటుకు గురిచేసింది. కోట్మి సోనార్, జైరాంనగర్ స్టేషన్ల మధ్య ఉన్న ట్రాక్‌పై ఒకేసారి రెండు గూడ్స్ రైళ్లు, ఒక ప్యాసింజర్ రైలు వచ్చాయి. అది గమనించిన ప్యాసింజర్ రైలు లోకో పైలట్ వెంటనే రైలును ఆపేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ప్యాసింజర్ రైలు కదులుతూ ఉండగా ఈ సంఘటన జరిగింది. ట్రాక్‌పై ప్యాసింజర్ రైలు ఉండగా, హఠాత్తుగా ముందు నుంచి ఒకటి, వెనుక నుంచి ఒకటి గూడ్స్ రైళ్లు ట్రాక్ పైకి వచ్చాయి. ఇది గమనించిన ప్యాసింజర్ రైలు ప్రయాణికులు భయానికి గురయ్యారు. లోకోపైలట్ అప్రమత్తమై రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# మెట్రో ప్లాట్ ఫాంల వద్ద స్టీల్ గ్రిల్స్

**హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్లాట్‌ఫామ్‌ల వద్ద స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మెట్రో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట కొన్ని ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత క్రమంగా అన్ని స్టేషన్లకు విస్తరించాలని చూస్తోంది. రానున్న రెండున్నర ఏళ్లలో హైదరాబాద్‌లోని అన్ని మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రయాణికులకు భద్రత కోసం హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్.. అనేక చర్యలు చేపడుతోంది. నిత్యం ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఇతర పనుల కోసం మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రద్దీ సమయాల్లో మెట్రో స్టేషన్లు.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. నిత్యం మెట్రో రైళ్లలో లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. దీంతో కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌లు నిండిపోతు న్నాయి. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు చూస్తున్నారుఇక మెట్రో రైలు వచ్చే సమయంలో ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటు చేసుకుంటుండటంతో.. వారు రైలు పట్టాలపై పడే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు ముందుగానే అలర్ట్ అవుతున్నారు. మెట్రో ప్లాట్‌ఫామ్‌లపై స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్రో రైలు డోర్ల వద్ద కాకుండా కోచ్‌ల పొడవునా.. ప్లాట్‌ఫామ్‌పై ఈ ఉక్కు కంచెను ఏర్పాటు చేయనున్నారు.మొదట కొన్ని స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసి.. అవి ఏ రకంగా పనిచేస్తున్నాయో చూసి.. ఆ తర్వాత క్రమంగా మిగిలిన స్టేషన్లకు విస్తరించాలని భావిస్తున్నారు. వచ్చే రెండున్నర సంవత్సరాల్లో నగరవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోనూ ఈ స్టీల్ గ్రిల్స్ తీసుకురావాలని యోచిస్తున్నారు. అయితే ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం



పట్ల ప్రయాణికులు, నెటిజన్ల నుంచి భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మెట్రో రైలు వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల.. తోపులాటలు జరిగినా ప్రయాణికులు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోవడం, గాయాల పాలు కాకుండా ఉంటుందని కొందరు పేర్కొంటున్నారు.ఇలా చేయడం వల్ల చాలా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చని చెబుతున్నారు. అయితే ఇవి ఇప్పటికే ఏర్పాటు చేయాల్సిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయినప్పటికీ మొత్తమే ఏర్పాటు చేయకపోవడం కన్నా ఆలస్యంగానైనా ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషం అంటూ చెబుతున్నారు.కానీ కొందరు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇలా స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల.. మెట్రో రైలు, గ్రిల్స్ మధ్య ప్రయాణికులు ఇరుక్కుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మెట్రో రైలు ప్లా?ట్‌ఫామ్‌పైకి రాగానే అందులోకి ఎక్కేందుకు ఒకేసారి ప్రయాణికులు అంతా ఎగబడితే తోపులాట జరుగుతుందని పేర్కొంటున్నారు. ఇక రైలు ఎక్కి, దిగే ప్రయాణికులకు ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల కొత్త సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. ఇప్పటికే మెట్రో రైలు డోర్ల వద్ద తోపులాటలు జరుగుతున్నాయని.. ఇక ఆ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తే.. ఆ సమస్య మరింత తీవ్రం అవుతుందని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ముందుగా కొన్ని స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తే.. ప్రయాణికుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూసి.. మిగిలిన స్టేషన్లలో ఏర్పాటు చేయాలా వద్దా అనేది చూడాలని ప్రయాణికులు సూచిస్తున్నారు.

# ఈ రోడ్డు బాగుపడేది ఎప్పుడూ?

**హైదరాబాద్ :** రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర రోడ్డు మార్గాల్లో అదొకటి.. బాగా రద్దీగా ఉండే రూట్లలో ఇదొకటి. నిత్యం చీమల బారులా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగుకో గుంత.. వాహనం అదుపుతప్పితే ప్రాణం పోయినట్లే. నేతలు హామీలు ఇచ్చినా.. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు రూపు మాత్రం మారడం లేదు. చేవెళ్ల బస్సు ప్రమాదం నేపథ్యంలో మరోసారి వార్తల్లోకెక్కింది.బీజాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారి మొత్తం మూలమలుపులు, ఇరుకైన రోడ్లు ప్రస్తుతం ప్రయాణికులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నది. ఉదయం, రాత్రి వేళలో ఈ రహదారి గుండా ప్రయాణాలు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. రయ్.. రయ్ అంటూ దూసుకుపోతున్న డంపర్లు, టిప్పర్లు, లారీల మోతకు ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగించడంతోపాటు పరిమితికి మించి తమ వాహనాల్లో టన్నుల కొద్ది లోడుతో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఈ రహదారంతా అడుక్కో గుంత మాదిరిగా ప్రమాదకరంగా మారింది. గత మూడు రోజుల క్రితం చేవెళ్ల సమీపం మిర్జాగూడ వద్ద రోడ్డుపైన గుంతను తప్పించబోయి అతివేగంతో కంకర టిప్పర్.. ఆర్టీసీని బస్సును ఢీ కొట్టిన ఘటనలో 19 ముంది ప్రయాణికులు మృతి చెందిన ఘటన అందరిని కలిచి వేస్తుంది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం రోడ్డువిస్తరణ పనులు జాప్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వం... అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.గత 10 ఏళ్ల నుంచి బీజాపూర్ –హైదరాబాద్ రోడ్డు విస్తరణ మీదనే చేవెళ్ల రాజకీయం నడుస్తూ వస్తుంది. కర్ణాటక రాష్ట్రంలోని పలు ముఖ్యమైన జిల్లాలు, వికారాబాద్ నారాయణపేట జిల్లాల కు కొడంగల్, తాండూరు, పరిగి చేవెళ్ల నియోజకవర్గం మీదుగా వెళ్లే రహదారి ప్రధాన రోడ్డు కావడం గమనార్హం. వివిధ ప్రాంతాల ప్రజలంతా రాష్ట్ర రాజధానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రహదారి ప్రతినిత్యం చీమలదండులా వాహనాల బారులు కనిపిస్తూ ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డు విస్తరణ కాకపోవడంతో ప్రతినిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని వందలాది ప్రాణాలు పోవడంతో పాటు పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.అప్పా జంక్షన్ నుంచి మోయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, వికారాబాద్ వరకు రహదారి అస్తవ్యస్తంగా మారింది. గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఇటీవల కురిసిన వర్షాలకు బీటీరోడ్డు తేలి అధ్వానంగా మారింది. ప్రతినిత్యం ఈ రహదారి నుంచి రైతులు పండించిన పంటలు, కూరగాయలు, పూలు, పండ్లు, తాండూరు నుంచి సిమెంట్ ట్యాంకర్లు, బండలు, పెద్దేముల్



నుంచి సుద్ద, వికారాబాద్, మర్పల్లి, మోమిన్ పేట్, నవాబ్ పేట్ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ఎర్రమట్టి లారీలు రోజు రాకపోకలు సాగిస్తుంటాయి.పరిమితికి మించి సరుకు రవాణా చేసినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. తెలిసిన కూడా మామూళ్ల మత్తులో రవాణా శాఖ అధికారులు తూతూమంత్రంగానే తనిఖీలు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఫోర్ లైన్ల రహదారి కోసం ఐదేళ్ల క్రితమే రూ.925 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే అయితే రోడ్డుకి ఇరువైపులా మర్రిచెట్ల తొలగింపు విషయంపై కొందరు పర్యావరణవేత్తలు గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు దాఖలు చేయడంతో పనులకు బ్రేక్ పడింది. గతంలో మంత్రులుగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, మాజీఎంపీ రంజిత్ రెడ్డి, ప్రస్తుత ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యపై ఉమ్మడి రంగారెడ్డి ప్రజలు ప్రస్తుతం గుర్రుగా ఉన్నారు. రోడ్డు విస్తరణ విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపడంలో విఫలం కావడంతోనే రోడ్డు ప్రమాదాలను బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నాలుగు రోజుల నుంచి చేవెళ్ల, వికారాబాద్ నియోజకవర్గ ప్రజలంతా రోడ్డు విస్తరణ చేపట్టాలంటూ ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా గత పాలకుల తీరుపై విమర్శలు గుప్పిస్తూ అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. రోడ్డు ప్రమాదాల పైన చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. రోడ్లు బాగుంటేనే ప్రమాదాలు ఎక్కువ జరగుతాయని ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పై ప్రజలు మండిపడుతున్నారు.రోడ్డు సరిగా లేకపోతేనే యాక్సిడెంట్లు కావు బండ్లు నెమ్మదిగా వెళ్తాయి...రోడ్లు ఎంత మంచిగా ఉంటే అన్ని ప్రమాదాలు జరగుతాయని అయన కామెంట్ చేయడం పై ప్రజలంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. మరో పక్క చేవెళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన రోజే ఎమ్మెల్యే కాల యాదయ్య షాబాద్ లో అభివృద్ధి కార్యక్రమంలో జిమ్ ఓపెనింగ్ పాల్గొనడం పై ఆయనపై సైతం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో ఇంత పెద్ద ప్రమాదం జరిగి 19 మంది చనిపోతే స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి.. ప్రారంభోత్సవాలో ఎలా పాల్గొంటారని నియోజకవర్గ ప్రజలు పలు విమర్శలు చేస్తున్నారు. ఇది ఇది ప్రజల సమస్యలపై నేతలకు ఉన్న చిత్తశుద్ధి అంటూ పలు సామాజిక వేదికల మీద విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు మాత్రం మీ శవ రాజకీయాలు ఆపండి.. చిత్తశుద్ధితో ప్రజలు పడుతున్న బాధలను గుర్తించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలంటే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు సంధిస్తున్నారు.

# డిసైడింగ్ ఫ్యాక్టర్ సెటిలర్సే

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర రాజకీయ పరిస్థితులు నడుస్తున్నాయి. ఎవరికి ఎవరు మిత్రుడో.. ఎవరు శత్రువో తెలియడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో విరుద్ధ ప్రభుత్వాలు ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏపీలో టీడీపీ కూటమి పాలన సాగిస్తోంది. టిడిపి కూటమిలో బిజెపి ఉంది. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఎన్డీఏ తో పాటు బిజెపికి బద్ధ శత్రువు కాంగ్రెస్. ఈ లెక్కన రెండు ప్రభుత్వాలు రాజకీయంగా విరుద్ధంగా ఏర్పడినవి. మరోవైపు ప్రతిపక్షాలు సైతం భిన్న స్థితిలో ఉన్నాయి. ఏపీలో ప్రధాన ప్రతిపక్ష హోదా రాకపోయినా.. ప్రతిపక్ష పార్టీల్లో అతిపెద్దది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో ఉన్న కేసీఆర్ పార్టీతో వైసీపీకి మైత్రి ఉంది. ఇటువంటి సందిగ్ధ రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతోంది. తెలంగాణలో జరుగుతున్న ఈ ఉప ఎన్నికల్లో.. కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ అన్నట్టు పరిస్థితి ఉంది. మరో బలమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది. దీంతో టీడీపీతో పాటు జనసేన పరిస్థితి ఏంటి అన్నది తెలియడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ఇప్పటికే బీఆర్ఎస్ కు మద్దతు గా నిలవడమే కాదు ప్రచారం కూడా చేస్తోంది. ఎందుకంటే 2014 రాష్ట్ర విభజన నాటి నుంచి కెసిఆర్ తో స్నేహం కొనసాగిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఈ ఇద్దరూ క్లిష్ట పరిస్థితుల్లోనే ఉన్నారు. అందుకే ఒకరికొకరు సహకరించుకోవడమే తప్ప మరో పరిస్థితి ఉండదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రేవంత్ రెడ్డిముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. 2023 ఎన్నికల్లో సైతం తెలుగుదేశం సైలెంట్ కావడంతోనే కాంగ్రెస్ గెలిచిందన్న ఒక వాదన ఉంది. ఎందుకంటే అప్పుడు చంద్రబాబు జైల్లో ఉన్నారు. బిజెపితో మైత్రి కుదరలేదు. అటు బిజెపి సైతం టిడిపి సహకారం కోరలేదు. తెలుగుదేశం పార్టీ తటస్థ వైఖరి అనుసరించింది. చంద్రబాబు పట్ల రేవంత్ చూపే అభిమానం.. ఆ పై రేవంత్ తెలంగాణ సీఎం అవుతాడని భావించిన టిడిపి శ్రేణులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషణలు వచ్చాయి. అందుకు తగ్గట్టుగానే రేవంత్ విజయం సాధించిన తరువాత కూడా చంద్రబాబు పట్ల తన అభిమానాన్ని చాటుకుంటూ వచ్చారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కొనసాగుతూనే.. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాత్రం ఎవరికి వారు పట్టుపడుతూ వచ్చారు. ఈ తరుణంలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరుగుతుండడంతో టిడిపి మద్దతు ఎవరికీ అనే వాదన వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ లో సెటిలర్స్ అధికం. ఆపై కమ్మ సామాజిక వర్గ ప్రాబల్యం ఉంటుంది. అదే సమయంలో ఏపీకి చెందిన రెడ్డి సామాజిక వర్గం సైతం ఉంది. ఎప్పటికీ వైసీపీ స్టాండ్ అదే. తెలంగాణలో బిఆర్ఎస్ గెలిస్తే.. ఆ పార్టీకి జవసత్వాలు వస్తాయి. అది ఏపీ పై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే వైసిపి కెసిఆర్ పార్టీకి మద్దతు తెలుపుతోంది. సహజంగానే తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన వైసీపీని వ్యతిరేకిస్తాయి. జూబ్లీహిల్స్ లో ఉన్న సెటిలర్స్ టిడిపి తో పాటు జనసేన ను అభిమానిస్తే వారంతా కాంగ్రెస్ వైపు టర్న్ అవుతారు. వైసీపీని అభిమానించిన వారు కెసిఆర్ పార్టీ వైపు వెళ్తారు. సో ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఏపీ పార్టీలే కీలకం అన్నమాట.

## చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు..

-మొదటిపేజీ తరువాయి

పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్డు షోలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్షించినట్లు సమాచారం.

## జూబ్లీహిల్స్‌లో గ్రామస్థాయి అభివృద్ధి కూడా లేదు

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తమ హామీల గురించి ప్రస్తావించడం లేదని, ఇచ్చిన గ్యారంటీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. ఉచిత బస్సు పథకం గురించి మాట్లాడుతున్నారని, అన్ని సమస్యలకు అదే పరిష్కారమన్నట్లు వ్యవహరించడం వారి మూర?త్వమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఎక్కువ వాటా కేంద్రానిదేనని, ఆ పథకాన్ని ఆపేస్తామని సీఎం ఎలా అంటారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుకు గతంలో పాలించిన బీఆర్ఎస్ పార్టీ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో ఉండే కనీస అభివృద్ధి కూడా ఇక్కడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా నిధులు లేవని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైందని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై నమ్మకం లేకపోవడంతో జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోలేక పోతున్నారని, ఈ గందరగోళం సర్వేల్లోనూ ప్రతిబింబిస్తోందని ఆయన విశ్లేషించారు.

## సెంటిమెంట్ అన్నిసార్లూ పనిచేయదు

-మొదటిపేజీ తరువాయి

సంక్షేమ పథకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. కొందరు 'కారు కావాలా, బుల్డోజర్ కావాలా' అని నినాదాలు చేస్తున్నారని, కానీ ఇక్కడ కారు గుర్తుకే దిక్కులేదని ఎద్దేవా చేశారు. తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను రౌడీ షీటర్ అంటున్నారని, దమ్ముంటే కేటీఆర్ ఒక్క ఎఫ్ఐఆర్ అయినా బయటపెట్టాలని సవాల్ విసిరారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించబోతోందని ఆయన పునరుద్ఘాటించారు.

## లోకల్ బాడీ ఎన్నికలు

## ఇద్దరు నిబంధన రద్దుకు గవర్నర్ ఆమోదం


-మొదటిపేజీ తరువాయి

తీసుకొచ్చారు. ఈ నిబంధన 1995 మే 31 నుంచి అమలులోకి వచ్చింది. ఈ నిబంధనను ఎత్తివేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018, పురపాలక చట్టం 2019లను సవరిస్తూ ఆర్డినెన్స్ జారీకి గత నెల 23న జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీర్మానించింది.ఈ నిబంధన కారణంగా గత కొన్ని దశాబ్దాలుగా అనేకమంది రాజకీయంగా చురుకైన వ్యక్తులు స్థానిక ప్రజాప్రతినిధులుగా మారే అవకాశాన్ని కోల్పోయారు. ముఖ్యంగా, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం, సమర్థ నాయకత్వానికి ఈ నిబంధన ఆటంకంగా ఉందని భావించిన ప్రభుత్వం.. ఈ ఎన్నికలలో పౌరులందరికీ సమాన అవకాశం కల్పించే ఉద్దేశంతో సవరణ చేపట్టింది.మంత్రిమండలి తీర్మానం తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను అదే నెల 24న గవర్నర్ ఆమోదానికి పంపింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అంశంపై న్యాయసలహా తీసుకున్న తరువాత.. తాజాగా దీనికి ఆమోదముద్ర వేశారు. దీని ద్వారా స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, నగరపాలక, పురపాలక ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు కూడా ఇకపై స్వేచ్ఛగా పోటీ చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇక పదవీకాలం ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంపై హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఆర్.సురేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని అధికరణ 243(ఇ) ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఎన్నికల సంఘం ప్రభుత్వ నిర్ణయం కోసం ఎందుకు ఎదురుచూస్తోందని ప్రశ్నించింది. పంచాయ తీ పాలకవర్గాల గడువు గత ఏడాది జనవరిలోనే ముగిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రద్దు చేసిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే త్వరలో నిర్ణయం తీసు కుంటా మని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 24కు వాయిదా వేసింది.

## ఎవ్వరికి పట్టని పంచాయితీలు


**మెదక్ :** జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనం తర్వాత అల్లీపూర్ గ్రామానికి గ్రహణం చుట్టుకుంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో ప్రజ లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే గ్రామాన్ని మున్సిపాలిటీ పరిధిలోకి చేర్చడంతో ప్రజల కష్టసుఖాలను పట్టించుకునే వారు కరువయ్యారు.మురుగు కాలువలు నిండినా.. రో డ్లు ధ్వంసం అయినా.. పాఠశాలతో పాటు వివిధ ప్రజోపకరమైన పనులు జరగడం లేదు. గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో విధి దీపాలు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరాతో పాటు వివిధ పనులు సత్వరమే జరి గేవి. మున్సిపాలిటీలో విలీనం తర్వాత ఇల్లు నిర్మించుకోవాలన్నా వాటి అనుమతులు పొందాలన్నా మున్సిపల్ అధికారులు గ్రామాన్ని పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజ లు ఆరోపిస్తున్నారు.గ్రామ పంచాయతీగా ఉన్న కాలంలో గ్రామానికి చెందిన వ్యక్తి స ర్పంచ్ గా, వార్డ్ మెంబర్లుగా, గ్రామపంచాయతీ సెక్రెటరీ తదితరులు గ్రామానికి సం బంధించిన వివిధ పనులను పర్యవేక్షించి వారికి కావలసిన పనులను చూసేవారు. మున్సిపాలిటీలో విలీనం తర్వాత గ్రామంలో నెలకొన్న సమస్యలు తీవ్రమవుతున్నాయి. జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలు రెండు పర్యాయాలుగా వాయిదా పడడంతో గ్రా మంలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. పాఠశాలలో కూడా విద్యార్థులకు కావలసిన సదుపాయాలను మునిసిపాలిటీ అధికారులు చేపట్టకపోవడంతో వాటిలో పందు లు, కుక్కలు చేరి పాఠశాల పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నాయి.ఎవరైనా ఇల్లు కట్టుకో వాలంటే గతంలో గ్రామపంచాయతీ సర్పం చ్ కానీ గ్రామ సెక్రెటరీకి దరఖాస్తు పెట్టుకుంటే సకాలంలోనే అనుమతులు వచ్చేవి. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయ డం వల్ల మున్సిపల్ కార్యాలయానికి వెళ్లినా అధికారులు సకాలంలో పనులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి నుండి గ్రామానికి వెళ్లే రోడ్డు 10 సంవత్సరాలుగా ధ్వంసం అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రతి సంవత్సరం పన్నులు కడుతు న్నామే తప్ప గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయడం లేదు.ఈ సంవత్సరం పన్నులు వసూలు చేయడానికి గ్రామానికి వచ్చిన అ ధికారులను ప్రజలు నిలదీయడంతో పన్ను లు వసూలు చేయకుండానే వెళ్లిపోయారు. ఈ గ్రామంలో నివసించే ప్రజలు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉండడంవల్ల నిత్యం వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. దర్గా నుండి అల్లిపురం గ్రామం వరకు రోడ్డు ధ్వంసమైనా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహ రిస్తున్నారు. గతంలో సర్పంచ్ గ్రామ పరిపాలన వ్యవస్థ బాగుండేదని ప్రస్తుతం గ్రామా న్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని ప్రజ లు కోరుతున్నారు. గ్రామ సమస్యలు తీర్చకపోతే మున్సిపాలిటీ నుండి మా గ్రామాన్ని తొలగించాలని కోర్టుకు వెళ్లేందుకు కూడా ఆ గ్రామ ప్రజలు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ మున్సిపల్ పాలకవర్గం లేకపోవడం, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడంతో గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని చెప్పవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గ్రామంలోని మురుగు కాలువలు, గుంతలు పడ్డ రోడ్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటానికి కారణాలు..



మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం అనేది తీవ్రమైన, నెమ్మదిగా అభివృద్ధి చెందే పరిస్థితి.. వీటిని విస్మరించకూడదు, ఎందుకంటే అవి శరీరానికి గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయి. శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) చాలా ముఖ్యమైన అవయవాలు.. ఇవి.. ఎన్నో విధులను నిర్వహిస్తాయి.. వాటి ప్రాథమిక పని, రక్తంలోని వ్యర్థాలను, అదనపు నీటిని వడపోసి, మూత్రం రూపంలో బయటకు పంపడం. ఇవి శరీరంలోని పిహెచ్ స్థాయిలను, ఉప్పు స్థాయిలను నియంత్రిస్తాయి, రక్తపోటును నియంత్రిస్తాయి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడతాయి. మూత్రపిండాల్లో రాళ్లు అంటే.. మూత్రపిండాల లోపల పేరుకుపోయిన ఖనిజాలు కలిసి ఉండి చిన్నవిగా లేదా పెద్దవిగా, గట్టి, ఘన స్ఫటికాలను ఏర్పరుస్తాయి. ఈ స్ఫటికాలు మొదట్లో చిన్నవిగా ఉంటాయి.. కానీ కాలక్రమేణా, అవి పెద్ద రాళ్లుగా ఏర్పడతాయి.. ఈ ముక్కలు మూత్ర నాళం గుండా కదులుతున్నప్పుడు, అవి తీవ్రమైన నొప్పి, మూత్ర విసర్జన సమయంలో మంట, మూసుకుపోవడానికి కారణమవుతాయి. మూత్రపిండాల్లో రాళ్లలో నాలుగు ప్రధాన రకాలు ఉన్నాయి.. కాల్షియం రాళ్లు, యూరిక్ యాసిడ్ రాళ్లు, స్ట్రువైట్ రాళ్లు, సిస్టీన్ రాళ్లు.. ప్రతి రకమైన రాళు ఏర్పడటానికి కారణాలు, ఆహారం – శరీర ప్రక్రియలు మారుతూ ఉంటాయి. గుర్తించి వెంటనే చికిత్స చేయకపోతే, ఈ రాళ్లు మూత్రపిండాలను దెబ్బతీస్తాయి.. లేక పదే పదే తిరిగి రావచ్చు. మూత్రపిండాల్లో రాళ్లకు అత్యంత సాధారణ లక్షణం పదునైన, తీవ్రమైన నొప్పి, ఇది నడుము, చేయి లేదా పొత్తి కడుపులో అకస్మాత్తుగా ప్రారంభమై హెచ్చుతగ్గులకు లోనవుతుంది. మూత్ర విసర్జన సమయంలో మంట, తరచుగా మూత్ర విసర్జన చేయాలనే కోరిక, మూత్రంలో రక్తం, దుర్వాసనతో కూడిన మూత్రం, వికారం – విశ్రాంతి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రాత్రి లేదా ఉదయం నొప్పి మరింత తీవ్రంగా ఉండవచ్చు. రాయి పెద్దదిగా మారితే, అది మూత్ర నాళాన్ని అడ్డుకుంటుంది.. మూత్ర నిలుపుదల – ఇన్ఫెక్షన్ పెరుగుతుంది. జ్వరం – చలి ఇన్ఫెక్షన్‌కు సంకేతం కావచ్చు. వెంటనే వైద్యుడు పరీక్షించకపోతే ఈ పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లోని నెఫ్రాలజీ విభాగానికి చెందిన డాక్టర్ హిమాన్షు వర్మ వివరిస్తూ.. మూడు ప్రధాన కారణాలు తగినంత నీరు తీసుకోకపోవడం, అధిక ఉప్పు ఆహారం, కాల్షియం –ఆక్సలేట్ వంటి అధిక స్థాయి ఖనిజాలు.

# కొలెస్ట్రాల్ కరిగించే ఆకులు



సాధారణంగా మన బాడీలో కొలెస్ట్రాల్ రెండురకాలుగా ఉంటుంది. అవి లో డెన్సిటీ లిపోప్రోటీన్ దీనినే చెడు కొలెస్ట్రాల్ అంటారు. హై డెన్సిటీ లిపోప్రోటీన్ దీనినే మంచి కొలెస్ట్రాల్ అంటారు. ఈ రెండు కొలెస్ట్రాల్‌ని బ్యాలెన్స్ చేస్తేనే గుండెకి మంచిది. ఎక్కువ కొలెస్ట్రాల్ రక్తంలోకి చేరితే ప్లాక్స్‌లా మారిలా ధమనుల్లో పేరుకుపోతుంది. దీనినే అథెరోస్క్లెరోసిస్ అంటారు. దీని వల్లే కరోనరీ ఆర్టరీ సమస్యలొస్తాయి. దీంతో ధమనులు బ్లాక్ అయిపోతాయి. అలాంటి కొలెస్ట్రాల్‌ని కరిగించాలి. మనం శాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్‌ని తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో పాటు ఎలాంటి వర్కౌట్ చేయకుండా నిశ్చలమైన లైఫ్‌స్టైల్ ఫాలో అయితే మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. హై కొలెస్ట్రాల్ ఉంటే కొన్ని లక్షణాలు ఉంటాయి. దీంతో పాటు గుండె సమస్యలు, హార్ట్ అటాక్స్, స్ట్రోక్స్ వస్తాయి. కొలెస్ట్రాల్‌ని తగ్గించడం వల్ల ఈ సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. కొలెస్ట్రాల్‌ని తగ్గించేందుకు కొన్ని ఆకులు హెల్ప్ చేస్తాయి. ఇవి మన డైట్‌లో యాడ్ చేస్తే చాలా మంచిది. పుదీనా ఆకులు వీటిని తీసుకున్నప్పుడు మనం రిఫ్రెష్‌గా ఫీల్ అవుతాం. ఇందులోనూ గొప్ప గుణాలు ఉంటాయి. వీటి కారణంగా జీర్ణ సమస్యలు తగ్గుతుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా మెటబాలిజాన్ని పెంచి ఫ్యాట్‌ని కరిగేలా చేస్తుంది. దీనికోసం పుదీనాని మన డైట్‌లో యాడ్ చేయాలి. లేదా పుదీనాని స్మూతీస్, సలాడ్స్‌లో యాడ్ చేయడం మంచిది. కరివేపాకులు మన వంటల పోపుల్లో ఎక్కువగా వాడతాం. వీటిలోని ఔషధ గుణాలు శరీరానికి మేలు చేస్తాయి. అంతేకాకుండా, యాంటీ ఆక్సిడెంట్స్ కొలెస్ట్రాల్‌ని తగ్గించి ఫ్యాట్ అబ్జార్బ్ కాకుండా చేస్తాయి. వీటిని మనం వంటల్లో వాడడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేసిన వారవుతాం. మెంతి ఆకుల్ని హై కొలెస్ట్రాల్‌ని తగ్గించే ఆకులని చెప్పొచ్చు. ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ని తగ్గించేందుకు హెల్ప్ చేస్తుంది. వీటిని మనం కూరల్లో కలిపి తీసుకోవచ్చు. లేదంటే క్యాప్సూల్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు. వేపాకుల్లో డీటాక్సీఫైయింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి మన బ్లడ్‌ని ప్యూరిఫై చేసి లివర్ పనితీరుని మెరుగ్గా చేస్తాయి.అంతకాకుండా కొలెస్ట్రాల్‌ని కరిగించడంలో హెల్ప్ చేస్తాయి. ఇందులోని కొన్ని గుణాలు చెడు కొలెస్ట్రాల్‌ని కరిగిస్తాయి. అంతేకాకుండా మంచి కొలెస్ట్రాల్‌ని పెంచుతాయి. వీటిని మన డైట్‌లో ఏదో రకంగా యాడ్ చేయడం, లేదా క్యాప్సూల్స్‌లా తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయి. తులసిలో కూడా మంచి ఔషధ గుణాలు ఉంటాయి. అధ్యయనాల ప్రకారం దీనిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గడమే కాకుండా లిపిడ్ ప్రొఫైల్ ఇంప్రూవ్ అవుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడేటివ్ స్ట్రెస్ కొలెస్ట్రాల్‌ని కరిగిస్తుంది. వీటిని సలాడ్స్‌లో వేసి తీసుకోవచ్చు. వీటితో పాటు ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు. ఈ ఆకుల్ని రెగ్యులర్‌గా తీసుకుంటే చాలా వరకూ మన బాడీలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. పైగా ఆరోగ్యానికి చాలా మంచిది. దీంతో పాటు మనం హెల్దీ డైట్ తీసుకోవడం, వర్కౌట్ చేస్తే మంచి రిజల్ట్ ఉంటాయి.


# ఉపవాసం ఉంటూ టీ, కాఫీలు ఎక్కువగా తాగితే..



వారంలో ఒక్కసారి ఉపవాసం ఉండడం, లేదా పండుగల టైమ్‌లో ఉపవాసం ఉండడం కొంతమందికి అలవాటే. అలాంటి టైమ్‌లో కొంతమంది ఏదైనా టిఫిన్ లాంటివి తీసుకుని ఒక్కపూట భోజనం చేస్తే మరికొంతమంది మాత్రం ఎలాంటి టిఫిన్స్ లేకుండా పండ్లు మాత్రమే తింటారు. అయితే, మధ్యమధ్యలో టీ, కాఫీలు మాత్రం చక్కగా తాగుతారు. దీని వల్ల అప్పటికప్పుడు ఎనర్జీగా ఫీల్ అవుతారు. అలా టీ, కాఫీలు తీసుకున్నప్పుడు బానే ఉంటుంది. కానీ, అది ఆరోగ్యానికి అంత మంచిది కాదని చెబుతున్నారు హెల్త్ ఎక్స్‌పర్ట్స్. టీ, కాఫీలని మనం షుగర్ వేస్తాం కాబట్టి తియ్యగా ఉండి ఇన్‌స్టంట్ ఎనర్జీగా అనిపించినప్పటికీ ఇందులో కెఫిన్ అనేక ప్రాబ్లమ్స్‌ని తీసుకొస్తుందని చెబుతున్నారు. సాధారణంగా ఉదయం లేవగానే టీ, కాఫీలు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది. అలానే తాగడం అస్సలు మంచిది కాదు. దీని వల్ల పొట్టలో యాసిడ్ లెవల్స్ పెరిగి కడుపు ఉబ్బరం, మంట, గ్యాస్ వంటి సమస్యలొస్తాయి. ఇక ఉపవాసంలో తాగితే మరిన్నీ సమస్యలు పెరుగుతాయి. కాబట్టి, దీనిని అవాయిడ్ చేయడం మంచిది. సాధారణంగా టీ, కాఫీలు తాగినప్పుడు బ్రెయిన్ కాస్త యాక్టివ్‌గా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ, ఉపవాసంలో టైమ్‌లో కడుపులో ఏమి ఉండవు. దీంతో మనం కెఫిన్ తీసుకున్నప్పుడు అది కడుపులో శోషించుకునేందుకు ఏమి ఉండవు. దీంతో కొద్దిసేపటికే నీరసంగా అయిపోతుంది. భయం భయం, ఆందోళనగా ఉంటుంది. కాబట్టి, తాగకపోవడమే మంచిది. టీ, కాఫీల్లోని కెఫిన్ డీహైడ్రేషన్‌కి కారణమవుతుంది. దీని వల్ల ఒంట్లోని హైడ్రేషన్ తగ్గుతుంది. దీంతో ఇంకా నీరసంగా మారతారు. కాబట్టి, టీ, కాఫీలకి దూరంగా ఉండడం మంచిది. టీ, కాఫీల బదులు వేడి నీరు కొబ్బరి నీరు, లిక్విడ్స్ వంటివి తీసుకోండి. హెర్బల్ టీలు తాగడం కూడా మంచిదే. అందులో లెమన్ టీ, డాండలీన్, చామంతి టీ వంటివి టీలను తీసుకోండి. దీని వల్ల కాస్త యాక్టివ్‌గా మారతారు. అయితే, అదే టైమ్‌లో పండ్లని తీసుకోండి. అంతేకానీ, పండ్లతో చేసిన జ్యూస్‌లని తాగొద్దు. దీనికి కారణం ఇందులో ఫైర్ ఉండదు. పైగా షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, నేరుగా పండు తినండి. దీంతో ఫైబర్ ఉంటుంది. కడుపు నిండుగా ఉంటుంది. ఇక షుగర్ డ్రింక్స్ కారణంగా బ్లడ్ గ్లూకోజ్ లెవల్స్ పెరగడమే కాకుండా వెయిట్ గెయిన్ అవుతారు. చాలా మంది బరువు తగ్గడానికి ఫాస్టింగ్ చేస్తుంటారు. టీ, కాఫీలను మాత్రం మరవరు. అయినప్పటికీ బరువు తగ్గకపోవడానికి కారణం అందులోని పంచదారే.

# బొప్పాయి తింటే ఊహించని అద్భుతాలు..

పడుకునే ముందు మీ ఆహారంలో బొప్పాయిని చేర్చుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. విటమిన్లు, ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి, మెరిసే చర్మాన్ని కోరుకునేవారికి ఇది అద్భుతమైన ఎంపిక. కొంతమంది ఉదయం, మరికొందరు సాయంత్రం పండ్లు తీసుకోవడానికి ఇష్టపడతారు. అయితే పడుకునే ముందు మీ ఆహారంలో బొప్పాయిని చేర్చుకోవడం వలన మీ శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉండే బొప్పాయిని రాత్రిపూట తినడం వలన ఆరోగ్యంపై కలిగే ప్రభావాలు ఇక్కడ వివరంగా ఉన్నాయి. బొప్పాయిలో పపైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్ ఉంటుంది, ఇది ఆహారంలోని ప్రొటీన్లను విచ్ఛిన్నం చేసి, జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. రాత్రి భోజనం తర్వాత బొప్పాయి తినడం వలన జీర్ణ ప్రక్రియ సాఫీగా జరిగి, మీరు కడుపులో గ్యాస్, అసిడిటీ లేదా మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. పపైన్, జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే, రాత్రిపూట బొప్పాయిని ఆహారంలో చేర్చుకోవడం ఒక తెలివైన ఎంపిక. ఇందులో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది చాలా సేపు కడుపు నిండుగా ఉంచుతుంది. దీనివలన రాత్రి ఆలస్యంగా లేదా నిద్రకు ముందు అనారోగ్యకరమైన చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. బొప్పాయి మీ శరీర జీవక్రియను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది. ఇది కొవ్వును కరిగించడానికి తోడ్పడుతుంది. పండుకునే ముందు బొప్పాయి తీసుకోవడం వలన నిద్ర నాణ్యత కూడా మెరుగుపడుతుంది. బొప్పాయిలో ట్రిప్టోఫాన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది మెదడులో సెరోటోనిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. సెరోటోనిన్ మెలాటోనిన్‌గా మారుతుంది. ఇది మంచి నిద్రకు సహాయపడుతుంది. ఇందులో ఉండే మెగ్నీషియం కండరాలను సడలించడానికి, నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది. తద్వారా నిద్ర బాగా పడుతుంది. బొప్పాయిలో ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడతాయి. ఆరోగ్య నిపుణుల సలహా ప్రకారం, ఏదైనా ఆహారంలో ముఖ్యమైన మార్పులు చేసే ముందు లేదా మీకు మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది..



# పొట్టు మినపప్పు తింటే పుట్టెడు లాభాలు!



మినపప్పు అంటేనే పోషకాల గని. వీటిలో ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, పాస్పరస్, కాల్షియంతోపాటు ఎన్నో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. మినపప్పులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీనిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణక్రియను మెరుగు పరచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పప్పు కేవలం వంటకాల రుచిని పెంచడం మాత్రమే కాదు.. దీనిని తీసుకోవడం వల్ల బోలెడు హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చు. పొట్టు మినపప్పు, అనగా గింజ తొక్కు తొలగించకుండా ఉంచిన మినపప్పు. పొట్టు మినపప్పులో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పొట్టు మినపప్పులో ఉండే బి–విటమిన్లు , ఇతర ఖనిజాలు మెదడు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వలన పొట్టు మినపప్పు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మినపప్పు అంటేనే పోషకాల గని. వీటిలో ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఫైబర్, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, పాస్పరస్, కాల్షియంతోపాటు ఎన్నో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. మినపప్పులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీనిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణక్రియను మెరుగు పరచుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పప్పు కేవలం వంటకాల రుచిని పెంచడం మాత్రమే కాదు.. దీనిని తీసుకోవడం వల్ల బోలెడు హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చు. అందుకే ఈ పప్పును పోషకాల గని అని అంటారు. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వారు.. మినప పప్పుతో చేసిన వంటకాలు ప్రతీ రోజు డైట్‌లో చేర్చుకుంటే మంచి ప్రయోజనం ఉంటుందంటున్నారు. పొట్టు మినపప్పుతో మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని చెబుతున్నారు. పొట్టు తీయని మినప పప్పును తీసుకుంటే మరింత ఎక్కువ ప్రయోజనకరం. ఈ పప్పులో పుష్కలంగా ఉండే ఫైబర్, ప్రొటీన్లతో పాటు ఇతర పోషకాలు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్లో ఉంచడానికి చాలా బాగా సహాయపడతాయంటున్నారు. మినప పప్పులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను తగ్గించడానికి ఇది చాలా బాగా సహాయపడుతుందని చెబుతున్నారు. ఈ పప్పు.. కిడ్నీల సంరక్షణకు మరింత మంచిది. మినప పప్పులో సమృద్ధిగా ఉండే కాల్షియం, పాస్పరస్ ఎముకల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మరింత మంచిది. మినప పప్పు చర్మ సౌందర్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది. ఈ పప్పులోని పోషకాలు సన్ టాన్స్, మొటిమలు, ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పని చేస్తాయి. ఈ పప్పుతో జుట్టు సంరక్షణకు మేలు జరుగుతుంది. పొట్టు మినపప్పు ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే పప్పులలో ఒకటి. ఇది పోషక పదార్థాల్లో సమృద్ధిగా ఉండి ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. పొట్టు మినపప్పులో ఉండే పోషకాలు శరీర కండరాల అభివృద్ధి కోసం అత్యవసరమైన ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్నాయి. జీర్ణశక్తి కోసం దీనిలో ఉన్న ఆహార ఫైబర్ ఉపయోగపడుతుంది.

# కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే పార్టీ

ఓట్ల కోసం, సీట్ల కోసం, వాళ్లు ఎంత దిగజారడానికైనా సిద్ధమే
బీజేపీకి జూబ్లీహిల్స్‌లో పది వేల ఓట్లే కంటే ఎక్కువ వస్తే
మంత్రి పొన్నం రాజీనామా చేయాలు
జూబ్లీహిల్స్‌లోతీర్పుభారతీయజనతాపార్టీపక్షాన నిలుస్తుంది
బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే పార్టీ. ఓట్ల కోసం, సీట్ల కోసం, వాళ్లు ఎంత దిగజారడానికైనా సిద్ధమేనని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ తో కలిసి మాట్లాడారు. ప్రజలను ఆకట్టుకునేందుకు ఆకాశాన్నే చేతిలో పెడతామని చెబుతారు, కానీ వాస్తవంలో మాట నిలబెట్టుకోరు. హామీలు ఇవ్వడమే వాళ్ల లక్ష్యం ? కాని అమలు మాత్రం శూన్యమన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో 'డిక్లరేషన్ల' పేరుతో వివిధ వర్గాల ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారు.మహిళల కోసం మహిళా డిక్లరేషన్, దళితుల కోసం దళిత డిక్లరేషన్, రైతుల కోసం కిసాన్ డిక్లరేషన్, యువత కోసం యువ డిక్లరేషన్ అంటూ? ప్రతి వర్గానికి అనేక హామీల వర్షం కురిపించారు. కానీ ఇప్పుడు ఆ డిక్లరేషన్లు అన్నీ ఎక్కడున్నాయి? మాయమైపోయాయి? మసకబారి పోయాయి? ప్రజలకు చేసిన వాగ్దానాలు బుట్టదాఖలయ్యాయి. ఓట్లు, సీట్లు దక్కించుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఆ హామీల విలువ మరిచిపోయింది. ఇదే వాళ్ల నిజ స్వరూపమనిం దుయ్యబట్టారు.

**మాటలు గొప్పగా, పనులు సున్నా!**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈరోజు గుర్తు చేసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు.దళితులకు సంబంధించిన హామీలు... ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పారు. విద్యార్థులు 10వ తరగతి పాస్ అయితే రూ.10,000, డిగ్రీ పూర్తయితే రూ.50,000, ఆపై ఉన్నత విద్య కోసం రూ.1 లక్షతో పాటు ప్రాజెక్ట్ లు, పరిశోధనల నిమిత్తం మరో రూ.5 లక్షలు ఇస్తామని మాటలు చెప్పారు.. ప్రకటనలు గుప్పించారు. కానీ ఈ హామీలలో



ఒక్కటీ నెరవేరలేదు.

**కాగితం మీద మాత్రమే ఉన్న 'దళిత డిక్లరేషన్' ?**
**ప్రజల జీవితాల్లో మాత్రం శూన్యం!**

ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అదే పాత నాటకం మొదలుపెట్టింది.రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా, మళ్లీ అదే వాగ్దా నాలతో పేద ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలోనే కాంగ్రెస్ మంత్రుల మాటలే వాళ్ల మోసాన్ని బయటపెడుతున్నాయి. మొన్ననే మంత్రి పొన్నం ప్రభాకర్ తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. నూతన పెళ్లి చేసుకున్న పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వలేం? మేము హామీ ఇచ్చేనాటికి తులం బంగారం ధర 50 వేలే... అంటూ చేతులెత్తేశారు.ప్రజలకు ఇచ్చిన మాటల విలువ బంగారం రేటుతో కొలుస్తారా? ఇంకా దామోదర్ రాజనర్సింహ కూడా పత్రిక ప్రకటనలో అంగీకరించారు ? "తొందరపడి హామీలు ఇచ్చామని.ఒక పార్టీ హామీలను తాము తప్పుగా ఇచ్చామని మంత్రులు స్వయంగా చెబుతున్నారు! ఇదే కాంగ్రెస్ పాలన, ఇదే వాళ్ల స్థాయి.ఇంకా మరోవైపు, బిల్లుల చెల్లింపుల పేరుతో మంత్రులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే స్థాయికి దిగజారిపోయారు. ప్రభుత్వ అంతర్గత కలహాలతో చివరికి సీఎంకి పిలిపించి మాట్లాడించే పరిస్థితి వచ్చింది.తెలంగాణ ప్రజలందరూ గమనించాలి ? ఇది ప్రభుత్వం కాదు, ఇది కలహాల, కల్పిత హామీల, మోసాల ప్రభుత్వ.ప్రజలను మోసం చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో తెలంగాణ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు ? "బీజేపీకి జూబ్లీహిల్స్‌లో పది వేల ఓట్లే వస్తాయి" అంటూ విమర్శలు చేస్తున్నారు.పొన్నం ప్రభాకర్.. మీరు చెప్పిన మాటకు కట్టుబడి ఉండండి. పది వేలకంటే ఎక్కువ ఓట్లు వస్తే,మీరు మీ మంత్రి పదవికి రాజీనామా చేస్తారా? ఆ మాటకు మీరు బహిరంగంగా సమాధానం చెప్పాలి.భారతీయ జనతా పార్టీని అవహేళన చేయడం అంటే, ప్రజల తీర్పును అవహేళన చేసినట్టే. ప్రజలే నిర్ణయిస్తారు ఎవరు గెలుస్తారో ? మీ అంచనాలు, మీ పంచాంగ జోస్యాలు కాదు! మీరు బీజేపీని తక్కువ చేసి మాట్లాడటానికి ముందు,మీ సొంత సర్వే రిపోర్టులు చూడండి.జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకత ఎంత ఉందో మీ నాయకులే చెబుతున్నారు.ఈ సారి జూబ్లీహిల్స్‌లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బ్రహ్మాండమైన విజయాన్ని సాధించబోతున్నారు. ఎందుకంటే ప్రజలు అన్నీ గమనించారు.. అంతకుముందు 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలన, గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలన ? రెండూ అస్తవ్యస్తంగా ఒకే దారిలో నడుస్తున్నాయి.ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు చిలక జోస్యాలు, పంచాంగ అంచనాలు మానేయాలి. ప్రజలే తుది తీర్పు చెబుతారు.ఆ తీర్పు భారతీయ జనతా పార్టీ పక్షాన నిలుస్తుందన్నారు.

# వైద్య వృత్తిలో విలువలు పాటిస్తూ నిస్వార్థ సేవలు

## డా.అంజయ్య సేవలు ఆదర్శనీయం
## డి.బి.ఎస్.ఏ విద్యార్థి సంఘం నాయకుల బృందం సన్మాన, సత్కారాలు

హైదరాబాద్, 06 నవంబర్ (ధర్మఘంట):
ఆరోగ్య రంగంలో అత్యున్నతమైన సేవలను లక్ష్యంగా పెట్టుకుని, వైద్య వృత్తిలో విలువలు పాటిస్తూ నిస్వార్థ సేవలతో ప్రతి రోగి ప్రాణాన్ని కాపాడటాన్ని ధర్మంగా మార్చుకున్న డా. అంజయ్య వ్యక్తిత్వం అనర్గళమని డి.బి.ఎస్.ఏ స్టేట్ కో ఆర్డినేటర్, ఓయూ స్కాలర్ జంగిలి దర్శన్ అన్నారు. నేడు ఎల్బీనగర్ లోని కామినేని దవాఖానలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కామినేని హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తూ, వైద్య సేవల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమాజంలో ఆరోగ్యభద్రతను బలోపేతం చేస్తున్న నిస్వార్థ వైద్యునిగా పేర్గాంచి, వైద్య వృత్తిలో కర్తవ్యమే జీవనంగా, మానవతనే మతమన్న భావంతో, గతంలో గాంధీ హాస్పిటల్ లో, ఉస్మానియా హాస్పిటల్ లో వివిధ ముఖ్య హోదాలో పనిచేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన వైద్యునిగా పదవీ విరమణ అనంతరం కూడా అంకితభావంతో పనిచేస్తున్న ఈ గొప్ప వ్యక్తిని మర్యాదపూర్వకంగా డిబిఎస్ఏ




బృందంతో కలిసి, సన్మానించి, సత్కరించే అవకాశం లభించడం గౌరవ సూచకంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రోగులు వచ్చిన ప్రతిసారి ఆశతో చూసే డా. అంజయ్య చిరునవ్వు ఎన్నో కుటుంబాల జీవితాల్లో మళ్లీ వెలుగులు నింపుతుందని అందుకే డా. అంజయ్య సేవా తపన, నిబద్ధత మాకు ఆదర్శం, ప్రేరణ అని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కప్పపహాడ్ కారోబార్ దేవదాసు, డి.బి.ఎస్.ఏ విద్యార్థి నాయకులు మరియు రీసెర్చ్ స్కాలర్స్ సైదులు, అరవింద్ కలిసి పాల్గొని ఈ భేటీని అర్థవంతం చేశారు. వైద్య సేవలు అందించడమే కాకుండా సమాజానికి అవగాహనను కూడ పెంపొందించే డా. అంజయ్య నాయకత్వం ఆరోగ్య రంగంలో సాటిలేనిదన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తుల సాన్నిధ్యం మరింత సేవాభావాన్ని పెంచుతూ, ప్రజల జీవన ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు ప్రేరణగా నిలుస్తుందని, ఈ సందర్భంగా డా. అంజయ్య అందించిన ఆతిథ్యం, మాటల్లో నిక్షిప్తమైన మానవీయత ఒక్క క్షణం కూడా మరచిపోలేని అనుభూతిగా నిలిచిపోయిందన్నారు. సమాజానికి మేలు చేయాలన్న మన ధృఢసంకల్ప ప్రయాణంలో ఇలాంటి గొప్ప వైద్యుల ఆదర్శం ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం కలిగిస్తుందని విశ్వసిస్తున్నామని తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థికి గౌడ సంఘాల మద్దతు

**జూబ్లీహిల్స్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మధురా నగర్ లో గౌడ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు గౌడ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సినీ నటుడు సుమన్ హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్,బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, ,చిన్న శ్రీశైలం యాదవ్,ఇతర ముఖ్య నేతలు,గౌడ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేయాలని వారి సందేశాన్ని తెలియజేస్తున్నా ఇది నియోజకవర్గానికి ఉప ఎన్నిక. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీ గెలిపించారు. గౌడ్ లు , ముదిరాజ్, యాదవ్ నాయి బ్రాహ్మణ అన్ని బలహీన వర్గాలకు దేశంలోనే మొదటి సారి కుల సర్వే



చేసి బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చట్టం చేశాం. ఇక్కడ శాసన సభ ఏకగ్రీవ తీర్మానం చేసి పార్లమెంట్ లో అడ్డుకుంటున్నారు. ఉప ఎన్నికల్లో గెలిచి బలహీన వర్గాల ఐక్యత చూపెట్టాలి. నవీన్ యాదవ్ కు ప్రభుత్వం కేబినెట్ అండగా ఉంది. మనవాడు మన సమస్యలు తెలిసిన వాడు. రాజకీయంగా అందరి మద్దతు ఉంటేనే విజయం సాధిస్తాయని అన్నారు. అందరం మనమే అభ్యర్థి అనుకోని పని చేయాలి. రేణుకా ఎల్లమ్మ తల్లి బిడ్డను సర్దార్ సర్వాయి పాపన్న బిడ్డను. ఆపదలో ఉన్నప్పుడు రాకపోతే బాధ్యత ఉన్నది. ఈ సంవత్సరం 40 లక్షల ఈత మొక్కలు నాటడం జరిగింది. నేను ఉండే క్వార్టర్స్ లో కూడా ఈత చెట్లు పెట్టించాను. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి ఇక్కడ ఉన్న ఎమ్మెల్యేలు బలహీన వర్గాల వారే ఉన్నారు.. వాళ్లంతా నాపట్ల సానుకూలంగా బ్రదర్ లా ఫీల్ అవుతారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వర్గాలనే తేడాలు లేకుండా ఐక్యంగా ఎంపిలమంతా ఉద్యమించాం. సినీ నటుడు సుమన్ గల్లి గల్లి తిరుగుతున్నారు నవీన్ యాదవ్ గెలుపు కోసం పని చేస్తున్నారు. మనమంతా షాపులు , దుకాణాలు ,వ్యాపార సముదాయాలు ఎక్కడికెళ్లినా నవీన్ యాదవ్ గెలుస్తున్నారు అని ప్రచారం చేయాలి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి ఛాంపియన్.. అలాంటి పార్టీ నవీన్ యాదవ్ కు అవకాశం ఇచ్చింది. అందరం ఐక్యంగా పని చేసి నవీన్ యాదవ్ ను గెలిపించుకోవాలని అన్నారు.

# అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన కలెక్టర్

కరీంనగర్ : మానకొండూరు మండలం దేవంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 11వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి వెలిగించి ఈ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థుల ప్రతిభ పాఠవాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జూన్ 3 పరిధిలోని సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని 12 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లకు చెందిన బాలురు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. 6, 7, 8 తేదీల్లో జరిగే ఈ స్పోర్ట్స్ మీట్లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, హై జంప్, లాంగ్ జంప్ వంటి క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ప్రిన్సిపాల్ జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కొండపోచమ్మ డెలివరీ కెనాల్ నీటి విడుదల అపివేయాలి



**సిద్దిపేట :** కొండపోచమ్మ సాగర్ జలాశయం నుండి జగదేవ్ పూర్ మండలం, భువనగిరి ప్రాంతాలకూ విడుదల చేసే డెలివరీ కెనాల్ నీటి విడుదల ఆపివేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. డెలివరీ కెనాల్ గేట్ లలో సాంకేతిక లోపం తలెత్తడం వల్ల గేట్లు మూసివేత జరగడం లేదనీ నీటిపారుదల శాఖ అధికారులు తెలపగానే జిల్లా కలెక్టర్ కె. హైమావతి డెలివరీ కెనాల్ పరిశీలించి ఇరిగేషన్ డిఈ, ఏఈ లు ప్రయత్నించిన మూతపడకపోగా ఈ సమస్యను జిల్లా ఇంచార్జ్ మంత్రి సమాచారం అందించగానే గురువారం జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర నీటి పారుదల అధికారులు బృందం కొండపోచమ్మ సాగర్ జలాశయ డెలివరీ కెనాల్ ను పరిశీలించి మూసివేయడానికి కావలసిన ప్రణాళికను సిద్ధం చేసారు. సాంకేతిక లోపం గల కారణాలను గుర్తించి తక్కువ సమయంలో మూత పడేలా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గేట్లు తెరవడానికి మరియు మూయడానికి భవిష్యత్ లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు.

## మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కల్లెడ విద్యార్థుల ప్రతిభ



**జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలు గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లెడ కు చెందిన పలువురు విద్యార్థులు 17 సంవత్సరాల విభాగంలో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో కుమారి బండారి రేనుశ్రీ 100 మరియు 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. బాలుర విభాగంలో కుంట వరుణ్ 1,500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు.14 సంవత్సర విభాగంలో ఎం.డి సల్మాన్ 200 మరియు 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ. స్వరూపరాణి తెలియజేశారు. వీరి ప్రతిభకు కృషిచేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లావుడ్యా హారిక కృషి ని కొనియాడారు.ఈ విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో పాటు ఉపాధ్యాయబృందం,పేరెంట్స్ కమిటీ, విద్యార్థులు అభినందించారు.

## సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

**సిద్దిపేట :** సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాంపల్లి గ్రామానికి చెందిన పెద్దమనిషి బాల మల్లయ్య విద్యార్థులతో మాట్లాడుతూ.హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు నేను మీ అందరికీ ఈ విషయాన్ని తెలియజేస్తున్నాను. అని అన్నారు.బాల మల్లయ్య మాట్లాడుతుండగా విద్యార్థులు శ్రద్ధగా వింటూ, ఆయన మాటలతో ఆకట్టుకుని, చప్పట్లతో ప్రాంగణం మార్మోగించడం గమనార్హం.ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు చట్టబద్ధంగా లైసెన్స్ పొంది మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు.ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ. ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. చిన్న తప్పిదం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి విద్యార్థి ట్రాఫిక్ రూల్స్‌ను గౌరవించి, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాగంటి గోపినాథ్ ఫ్యామిలి సర్టిఫికెట్ వివాదం

**ఎమ్మార్వో ముందు హాజరయిన సునీత కుటుంబం**

**శేరిలింగంపల్లి :** మాగంటి గోపినాథ్ కుటుంబ ఫ్యామిలీ సర్టిఫికెట్ వివాదం పై శేరిలింగంపల్లి ఎంఆర్ఓ ముందు మాగంటి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. మాగంటి రెండవ భార్య మాగంటి సునీత తరపున ఆమె రెండవ కూతురు మాగంటి దీశిరా, బీఆర్ఎస్ లీగల్ సెల్ లలిత రెడ్డి హాజరయ్యారు.. బీఆర్ఎస్ లీగల్ సెల్ లలిత రెడ్డి మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యుల సర్టిఫికేట్ విషయంపై గత రెండు దఫాలుగా వివాదం నడుస్తుంది. ఈకేసు నవంబర్ 25కు వాయిదా పడింది. ఆధార్, ఓటర్ ఐడీ, పిల్లల ఓటర్ ఐడీ, ఆధార్ కార్డులలో అన్నింటిలో మాగంటి ఇంటి పేరు, తండ్రిగా గోపీనాథ్ పేరునే ఉంది. మాగంటి గోపీనాథ్, సునీతకు పుట్టిన పిల్లలే అక్షర, రిశిర, వాత్సల్య . అసెంబ్లీ సెక్రటరీ జారీచేసిన స్పౌస్ కార్డులో కూడా మాగంటి సునీత పేరు మాత్రమే ఉందని అన్నారు. తారక్ ప్రద్యుమ్న రికార్డులో ఎక్కడా మాగంటి అనే పేరులేదు, కోసరాజు అని మాత్రమే ఉంది. మాలిని దేవి విషయంలోనూ అదే ఉంది. డాటర్ ఆఫ్ వెంకటేశ్వర రావు అనే ఉంది కానీ వైఫ్ ఆఫ్ అని గోపీనాథ్ పేరు లేదు. ఇదంతా కావాలనే జరుగుతున్న కుట్ర మాత్రమే. తహశీల్దార్ ఎదుట జరిగిన విచారణలో మాగంటి మొదటి భార్యగా చెబుతున్న వారు ఎలాంటి ఆధారాలు సమర్పించలేదు.

## మానవత్వానికి ప్రతీక సిద్దిపేట సిపిఎస్. ఎం. విజయ్ కుమార్

**సామాన్యుడితో మమేకమై సమస్యల పరిష్కారం**

**సిద్దిపేట :** పోలీస్ కమిషనర్ కార్యాలయం అంటేనే సామాన్యులకు కాస్త బెరుకుగా ఉంటుంది. కానీ, సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. ఎం. విజయ్ కుమార్ ఆ అపోహలను తొలగిస్తున్నారు. తన కార్యాలయానికి వచ్చిన ఒక సామాన్య పెద్దమనిషి పట్ల ఆయన చూపిన ఆదరణ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.?తమ గోడు వెళ్లబుచ్చుకోవడానికి వచ్చిన ఆ వృద్ధుడిని సిపి ఆప్యాయంగా పలకరించారు. ఆయనకు ఎదురుగా కుర్చీ వేసి కూర్చోబెట్టి, స్వయంగా టీ తెప్పించి ఇచ్చారు. ఆ తర్వాత,ఏంటి తాతా ఏం సమస్య వచ్చింది? అంటూ ఎంతో ఓపికగా ఆయన చెప్పినదంతా విన్నారు. చట్టం దృష్టిలో పేద, మధ్యతరగతి, ధనిక అనే తారతమ్యాలు లేవని, అందరూ సమానమే అని స్పష్టం చేశారు.

# బిజినెస్

# టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవి నుంచి వైదొలిగిన మెహ్లి మిస్త్రీ!

## త్వరలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలుస్తుందని, త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మంగళవారం జరిగిన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (డీఎస్ఈ)లో డైమండ్ జూబ్లీ కార్యక్రమంలో మాట్లాడిన ఆమె.. భారత్ చాలా భిన్నమైన అంశాల ఆధారంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం మనం సాధిస్తున్న ఆర్థిక వృద్ధి అందరినీ కలుపుకుని సాగుతున్నది. అందుకే దేశంలో 2.5 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురాగలిగాము. ఇది మనందరి సహకారమని తెలిపారు. 2014లో పదవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ స్థానం నుంచి ఐదవ, నాల్గవ స్థానానికి, త్వరలో 2027-28 నాటికి మూడవ స్థానానికి చేరేందుకు వేగంగా వృద్ధి సాధిస్తున్నది. ప్రస్తుతం ఐదవ స్థానంలో ఉన్న భారత్, రాబోయే కొన్నేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లను దాటి జపాన్, జర్మనీలను అధిగమిస్తుంది. భారత్ స్వాతంత్ర్యం సాధించి 100వ సంవత్సరం చేరే 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగలదని అంచనా వేస్తున్నాం. పెరుగుతున్న విదేశీ పెట్టుబడులు, కృత్రిమ మేధ(ఏఐ) వంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పాటు తయారీ, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాలలో పనితీరు ద్వారా ఈ వృద్ధి సాధ్యమవుతుందని నిర్మలా సీతారమన్ పేర్కొన్నారు.

## అమెరికా నుంచి రికార్డ్ చమురు కొనుగోళ్లు



అమెరికా నుంచి చమురు దిగుమతులు నూతన రికార్డ్‌లను చేరాయి. ఇటీవల యూఎస్ అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఆంక్షలకు ప్రధాని నరేంద్ర మోడీ తలొగ్గి ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లను పెంచారు. చౌకగా లభించే రష్యా చమురును తగ్గించడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్ అమెరికా నుంచి భారత్‌కు గత ఐదేండ్లలో ఎప్పుడూ లేని స్థాయి గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో యూఎస్ నుంచి భారత్ రోజుకు సగటున 5,68,000 బ్యారెల్స్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. 2021 మార్చి తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరులో దిగుమతులైన 2,07,000 బ్యారెల్స్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ కావడం ఆందోళనకరం. ఇది ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గిందనడానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు. భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో యూఎస్ వాటా 12 శాతానికి పెరిగింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 4.5 శాతంగా ఉంది. అమెరికా నుంచి దిగుమతులు పెరిగినప్పటికీ.. రష్యా ఇప్పటికీ భారతదేశానికి అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. అక్టోబర్‌లో భారత్ దిగుమతుల్లో రష్యా వాటా 34 శాతంగా ఉండటం విశేషం. రష్యా నుంచి రోజుకు 16.2 లక్షల బ్యారెల్స చమురు దిగుమతి అయ్యింది. ఇరాక్, సౌదీ అరేబియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ట్రంప్ ఆదేశాల మేరకు రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. అమెరికాకు సహకరిస్తామన్న ప్రధాని మోడీ హామీ మేరకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్టు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం



మెహ్లి మిస్త్రీ మూడు ప్రధాన టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవికి రాజీనామా చేశారు. వివాదాలను నివారించి, రతన్ టాటా స్థాపించిన నైతిక విలువలు, సుపరిపాలన, సమగ్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు. మిస్త్రీ గత ఏడాది జీవితకాల ట్రస్టీగా తిరిగి నియమించబడినప్పటికీ, ప్రధాన ట్రస్ట్‌ల ఆమోదం లభించకపోవడంతో ఈ వివాదం చెలరేగింది. సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జీజీ టాటా నవ్‌సరి ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్ ట్రస్ట్ అనే మూడు ప్రధాన టాటా ట్రస్ట్‌ల ట్రస్టీ పదవి నుంచి తాను వైదొలగుతున్నట్లు మెహ్లి మిస్త్రీ మంగళవారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని టాటా ట్రస్ట్‌ల ట్రస్టీలకు రాసిన లేఖలో తెలియజేశారు. నవంబర్ 4 నాటి తన లేఖలో మిస్త్రీ ట్రస్టీగా పనిచేయడం తనకు దక్కిన అదృష్టమని, ఈ అవకాశం దివంగత రతన్ ఎన్ టాటా వ్యక్తిగత ఆమోదం ద్వారా లభించిందని, ఆయనను తన అత్యంత ప్రియమైన స్నేహితుడు, గురువుగా అభివర్ణించారని అన్నారు. ముంబైకి తిరిగి వచ్చిన తర్వాత తన ట్రస్టీషిప్ గురించి ఇటీవలి నివేదికల గురించి తనకు తెలిసిందని, టాటా ట్రస్ట్‌ల ప్రయోజనాలకు ఉపయోగపడదని, దాని దార్శనికతకు విరుద్ధమని తాను నమ్ముతున్న ఊహాగానాలకు ముగింపు పలకడానికి తన లేఖ సహాయపడుతుందని ఆయన అన్నారు. రతన్ టాటా నిలబెట్టిన విలువలకు తన నిబద్ధతను మిస్త్రీ పునరుద్ఘాటించారు. తన బాధ్యతలను నిర్వర్తించడంలో, నైతిక పాలన, నిశ్శబ్ద దాతృత్వం, సమగ్రత సూత్రాల ద్వారా తాను మార్గనిర్దేశం పొందినట్లు ఆయన పేర్కొన్నారు. తాను 2025 అక్టోబర్ 28 వరకు ట్రస్టీగా పనిచేశానని ఆయన ధృవీకరించారు. దాతృత్వ సంస్థ ప్రతిష్టను ప్రభావితం చేసే వివాదాలను నివారించాల్సిన అవసరంతోనే తాను పదవీ విరమణ చేయాలనే నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. రతన్ టాటా దార్శనికతకు తాను విధేయత చూపడంలో టాటా ట్రస్ట్‌లు ప్రజా వివాదంలో చిక్కుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఉందని ఆయన రాశారు. ఈ విషయాన్ని తొందరపెట్టడం వల్ల టాటా ట్రస్టుల ప్రతిష్ఠకు శాశ్వత నష్టం వాటిల్లుతుందని ఆయన అన్నారు. రతన్ టాటా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న స్ఫూర్తితో, ట్రస్టీలు పారదర్శకత, సుపరిపాలన, విస్తృత ప్రజల పట్ల శ్రద్ధతో వ్యవహరిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "నేను విడిపోతున్నాను" అని మిస్త్రీ లేఖను ముగించారు. "సంస్థ కంటే ఎవరూ గొప్పవారు కాదు" అని రతన్ టాటాను ఉటంకించారు.

# స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి బిగ్ అలర్ట్!

ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు బుల్లిష్ పథంలో ఉన్నాయి. అయితే, గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ రాబోయే 12-24 నెలల్లో 10-20 శాతం దిద్దుబాటును అంచనా వేస్తున్నాయి. దీనిని దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌లో సాధారణ క్షీణతగా చూడాలని సూచించాయి. గత కొన్ని నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు బుల్లిష్ పథంలో ఉన్నాయి. ాా× కంపెనీల పెరుగుదల, రేటు కోతల అంచనాలు, బలమైన కార్పొరేట్ ఆదాయాలు మార్కెట్‌ను కొత్త ఎత్తులకు పంపించాయి. అమెరికా, జపాన్, కొరియా, చైనాలలో సూచీలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. రెండు బ్యాంకులు (గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ) రాబోయే సంవత్సరాల్లో ఆసియా, ముఖ్యంగా భారతదేశం, చైనా, జపాన్, హాంకాంగ్ ప్రపంచ వృద్ధికి కేంద్రంగా మారుతాయని విశ్వసిస్తున్నాయి. భారత దేశంలో మౌలిక సదుపాయాల సౌకర్యాలు, తయారీ వేగం, అలాగే జపాన్‌లో కార్పొరేట్ సంస్కరణలు రెండూ దీర్ఘకాలంలో మార్కెట్‌కు శుభవార్త. స్టాక్ మార్కెట్‌లో ర్యాలీ తర్వాత స్వల్ప క్షీణత సాధారణమేనని గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ చెబుతున్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ సీఈఓ డేవిడ్ సోలమన్ ప్రకారం రాబోయే 12 నుండి 24 నెలల్లో మార్కెట్ 10 నుండి 20 శాతం వరకు పడిపోవచ్చు. అయితే ఈ క్షీణత దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌లో భాగంగా ఉంటుంది. చిన్న చిన్న షాక్‌లకు భయపడే బదులు పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడం కొనసాగించి, వారి పోర్ట్‌ఫోలియోలను తిరిగి సమతుల్యం చేసుకోవాలని ఆయన అన్నారు. సరళంగా చెప్పాలంటే మీ పెట్టుబడులను సమీక్షించండి, ఈ క్షీణతతో తొందరపడకండి. మోర్గాన్ స్టాన్లీ జజూూ టెడ్ పిక్ ప్రకారం మార్కెట్‌లో 10-15 శాతం క్షీణత చెడ్డ విషయం కాదు. కొన్నిసార్లు మార్కెట్ స్లో అవుతుంది, మళ్లీ పుంజుకుంటుంది. ×వీఖీ, ఖూ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్, బ్రిటిష్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ కూడా మార్కెట్ విలువలు చాలా ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. కాబట్టి మార్కెట్ క్షీణించినట్లయితే దానిని క్రాష్ కాకుండా దిద్దుబాటుగా పరిగణించండి. బలమైన పోర్ట్‌ఫోలియోలు ఉన్నవారు ఈ సమయంలో భయపడాల్సిన అవసరం లేదని సోలమన్, పిక్ ఇద్దరూ అంటున్నారు.



# భారత జట్టు ప్రకటన.. కెప్టెన్‌గా డీకే..

# స్పోర్ట్స్

## పన్నెండు జట్ల వివరాలు ఇవే

హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్-2025 టోర్నమెంట్‌కు భారత్ తమ జట్టును ప్రకటించింది. హాంకాంగ్‌లో నవంబరు 6 నుంచి 9 వరకు మోంగ్ కాక్ వేదికగా జరిగే ఈ పోట్టి టోర్నీలో భారత్‌కు.. మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సారథ్యం వహించనున్నాడు. డీకేతో పాటు రాబిన్ ఊతప్ప, స్టువర్ట్ బిన్నీ, అభిమన్యు మిథున్, భరత్ చిప్లి, షాబాజ్ నదీమ్‌లు హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్‌లో పాల్గొననున్నారు. అదే విధంగా.. దేశీ వెటరన్ క్రికెటర్ ప్రియాంక్ పాంచల్ కూడా ఈ టోర్నీలో భాగం కానున్నాడు.

**ఆరు ఓవర్ల పాటు ఆట**

కాగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్ టోర్నీలో.. ఒక్కో టీమ్‌లో ఆరుగురు సభ్యులు (మాజీ క్రికెటర్లు) ఉంటారు. ఆరు ఓవర్ల పాటు ఆట సాగుతుంది. ఇక ఈ షార్టెస్ట్ క్రికెట్ ఈవెంట్లో 2005లో టైటిల్ గెలిచిన భారత్.. రెండుసార్లు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అయితే, గతేడాది రాబిన్ ఊతప్ప కెప్టెన్సీలో కనీసం ఫైనల్ కూడా చేరలేదు టీమిండియా. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త సారథిగా డీకే రావడం విశేషం. కాగా తాజా ఎడిషన్‌లో పన్నెండు జట్లు పాల్గొంటున్నాయి.

**పన్నెండు జట్లు ఇవే**

భారత్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, అఫ్గనిస్తాన్, నేపాల్, ఇంగ్లండ్, యూఏఈ, కువైట్, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ (చైనా) ఈసారి టోర్నీలో భాగం కానున్నాయి. పూల్- 'ఎ' నుంచి సౌతాఫ్రికా అఫ్గనిస్తాన్, నేపాల్.. పూల్- 'బి' నుంచి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ యూఏఈ.. పూల్- 'సి' నుంచి ఇండియా, పాకిస్తాన్, కువైట్... పూల్- 'డి' నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్ పోటీపడతాయి.

హాంకాంగ్ సిక్సెస్-2025లో పాల్గొనే జట్ల వివరాలు



**భారత్**

దినేశ్ కార్తిక్ (కెప్టెన్), రాబిన్ ఊతప్ప, స్టువర్ట్ బిన్నీ, అభిమన్యు మిథున్, భరత్ చిప్లి, షాబాజ్ నదీమ్, ప్రియాంక్ పాంచల్.

**ఆస్ట్రేలియా**

అలెక్స్ రాస్ (కెప్టెన్), బెన్ మెక్‌డెర్మాట్, జాక్ వుడ్, నిక్ హొబ్సన్, క్రిస్ గ్రీన్, విల్ బొసిస్టొ, ఆండ్యూ టై.

**ఇంగ్లండ్**

జో డెన్లీ (కెప్టెన్), జేమ్స్ కోల్స్, ఈథన్ బ్రూక్స్, టోబీ అల్బర్ట్, జార్జ్ హిల్ డాన్ మౌస్లే, టామ్? అస్పిన్‌వాల్.

**బంగ్లాదేశ్**

అక్బర్ అలీ (కెప్టెన్) అబు హైదర్ రోని, జిషాన్ ఆలం, మొహమ్మధ్ సైఫుద్దీన్, మొసాడెక్ హొసేన్, రకీబుల్ హసన్, టొఫేల్ అహ్మద్.

**యూఏఈ**

కౌశిక్ హర్షిత్ (కెప్టెన్), ఖలీద్ షా, ముహమ్మద్ అర్ఫాన్, ముహమ్మద్ ఫారూక్, ముహమ్మద్ సాగిర్ ఖాన్, నిలాన్ష్ కేస్వాని, రెజిత్ కురుంగొడె, జాహిద్ అలీ.

**కువైట్**

యాసిన్ పటేల్ (కెప్టెన్), ఉస్మాన్ పటేల్, మీట్ భవ్సార్, బిలాల్ తాహిర్, రవిజ సాందరువాన్, అద్నాన్ ఇద్రీస్, మొహమద్ షఫీక్.

**నేపాల్**

శరద్ వేసావ్కర్ (కెప్టెన్), సందీప్ జోరా, లోకేశ్ బామ్, బాసిర్ అహ్మద్, ఆదిల్ ఆలం, రషీద్ ఖాన్, రూపేశ్ సింగ్.

**శ్రీలంక**

లాహిరు మధుషాంక (కెప్టెన్), ధనంజయ లక్షణ్, తనుక దబారే, నిమేశ్ విముక్తి, లాహిరు సమారకూన్, థారిందు రత్నాయక, సచిత జయతిలకె.

**సౌతాఫ్రికా**

జోర్డాన్ మోరిస్ (కెప్టెన్), అబ్దుల్లా బయోమి, ఈథన్ కన్నింగ్‌హామ్, బులెలొ దూబే, కషీఫ్ జోసెఫ్, బ్లేక్ సింప్సన్, జోరిచ్ వాన్ షాల్వేక్.

**హాంకాంగ్**

యాసిమ్ ముర్తజా (కెప్టెన్), బాబర్ హయత్, అన్షుమాన్ రథ్, ఐజాజ్ ఖాన్, నిజాకత్ ఖాన్, ఎహ్‌సాన్ ఖాన్, నస్రుల్లా రాణా.

**అఫ్గనిస్తాన్**

గుల్బదిన్ నైబ్ (కెప్టెన్), ఇక్రామ్ అలిఖిల్, కరీం జన్నత్, షరాఫుద్దీన్ అష్రఫ్, ఫర్మానుల్లా సఫీ, ఐజాజ్ అహ్మద్ అహ్మద్‌జాయ్, సెదీకుల్లా పచా.

**పాకిస్తాన్**

అబ్బాస్ అఫ్రిది (కెప్టెన్), అబ్దుల్ సమద్, ఖవాజా మొహమద్ నఫాయ్, మాజ్ సదాకత్, మొహమద్ షాజాద్, సాద్ మసూద్ షాహిద్ అజీజ్.

## నరాలు తెగే ఉత్కంఠ:

## సాంట్నర్ విధ్వంసకర ఇన్నింగ్స్ వృథా

న్యూజిలాండ్ పర్యటనను వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఘనంగా ఆరంభించింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన తొలి టీ20లో ఆతిథ్య కివీస్‌పై విండీస్ ఏడు పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. కాగా ఐదు టీ20 మ్యాచ్‌లు, మూడు టెస్టులు, మూడు వన్డేలు ఆడేందుకు వెస్టిండీస్.. న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం ఆక్లాండ్‌లో ఇరుజట్ల మధ్య తొలి టీ20 జరిగింది. ఈడెన్ పార్క్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుని.. విండీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (3), అలిక్ అథనాజ్ (16) విఫలమైనా.. వన్‌డౌన్ బ్యాటర్ షాయి హోప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మొత్తంగా 39 బంతులు ఎదుర్కొన్న హోప్ నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 53 పరుగులు సాధించాడు. మిగతా వారిలో రోస్టన్ చేజ్ (28), రోవ్‌మన్ పావెల్ (23 బంతుల్లో 33) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. కివీస్ బౌలర్లలో జేకబ్ డఫీ, జకారీ ఫౌల్క్స్ రెండేసి వికెట్లు తీయగా.. కైలీ జెమీషన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇక విండీస్ విధించిన 165 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఆది నుంచే తడబడింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (27), డెవాన్ కాన్వే (13) ప్రభావం చూపలేకపోయారు. వన్‌డౌన్ బ్యాటర్ రచిన్ రవీంద్ర (21) నిరాశపరచగా.. మార్క్ చాప్‌మన్ (7), డారిల్ మిచెల్ (13), మైకేల్ బ్రాస్‌వెల్ (1), జేమ్స్ నీషమ్ (11) పూర్తిగా విఫలమయ్యారు.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్..

## నెంబర్ వన్ ర్యాంకుల్లో

## అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి..!



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టీమిండియా యువ బ్యాటర్స్ అభిషేక్ శర్మ నెంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ ఆసియా కప్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లోనూ తనదైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దాంతో నెంబర్ వన్ బ్యాటర్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మరో టీమిండియా ఆటగాడు తిలక్ వర్మ మూడోస్థానంలో ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రెండోస్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్, నాలుగో స్థానంలో నిస్సంక (శ్రీలంక), నాలుగో స్థానంలో జోస్ బట్లర్ (ఇంగ్లండ్), ఆరోస్థానంలో ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఏడోస్థానంలో టిమ్ సీఫెర్ట్ (న్యూజిలాండ్), తొమ్మిద స్థానంలో కుషాల్ పెరీరా (శ్రీలంక), పదో స్థానంలో మిచేల్ మార్ష్ (ఆస్ట్రేలియా) ఉన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో విజయం తర్వాత పాక్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్ మెరుగయ్యాయి. కెప్టెన్ బాబార్ ఆజం తొమ్మిదిస్థానాలు మెరుగుపరుచుకొని 30వ స్థానానికి చేరుకున్నాడు. సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘా పదిస్థానాలు ఎగబాకి 39, 54 స్థానాలకు చేరారు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 12వ స్థానానికి, బంగ్లాదేశ్‌కు చెందిన టాంజిద్ హసన్ 17వ స్థానానికి, ఆఫ్ఘనిస్తాన్ ద్వయం రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ వరుసగా 15, 20వ స్థానాల్లో ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 10వ స్థానానికి చేరాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ముజీబ్ ఉర్ రెహమాన్, మహేది హసన్ 14, 17వ స్థానానికి చేరుకున్నారు. వెస్టిండీస్‌కు చెందిన జాసన్ హోల్డర్, రోస్టన్ చేజ్ 23, 38వ స్థానానికి చేరుకున్నారు. పాక్‌తో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ 15 స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరుకున్నాడు. టీమిండియా మరో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఐదు ర్యాంకులు దిగజారి 15వ స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాక్ ఆటగాడు ఆయుబ్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. జింబాబ్వే ప్లేయర్స్ సికందర్ రజా, వెస్టిండిస్ ప్లేయర్ రోస్టన్ చేజ్ వరుసగా రెండు, మూడో స్థానాలకు చేరుకున్నారు. టీ20ల్లో రజా 33 బంతుల్లో చేసిన సెంచరీతో ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపరుచుకున్నాడు. టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండు ర్యాంకులు దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, అక్షర్ పటేల్ నాలుగు ర్యాంకులు దిగజారి 170 పాయింట్లతో 15వ స్థానానికి చేరాడు. అభిషేక్ శర్మ 16వ స్థానంలో ఉన్నాడు.




# పిల్లల కోసం ఆ మాత్రం చేయలేరా? ఆసక్తిగా సంతాన ప్రాప్తిరస్తు ట్రైలర్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న తాజా చిత్రం సంతాన ప్రాప్తిరస్తు  ఈ మూవీకి సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో సంతానం కోసం యువత పడే పాట్లను ఇందులో చూపించనున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్ చూస్తే లవ్, పెళ్లి, పిల్లలు అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. చెప్పినమాట విననివాడే కొడుకు.. చెప్పినమాట విన్నట్లు నటించేవాళ్లే కూతురు.. అంతే పెద్దా తేడా లేదు... అనే డైలాగ్స్ నవ్వులు తెప్పిస్తున్నాయి. ప్రేమ పెళ్లి తర్వాత పిల్లల కోసం మన హీరో ఎన్ని కష్టాలు పడ్డారనేదే సంతాన ప్రాప్తిరస్తు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ చూసేయండి. ఈ చిత్రాన్ని పిల్లల దినోత్సవం కానుకగా నవంబర్ 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, జీవన్ కుమార్, తాగుబోతు రమేష్, రచ్చ రవి కీలక పాత్రలు పోషించారు.  ఈ సినిమాకు సునీల్ కశ్యప్ సంగీతమందించారు.


# అల్లు అర్జున్ లైనప్ చూస్తే షాక్ అవ్వాల్సిందే .. ఇక బన్నీ కెరీర్ నెక్స్ట్ లెవెల్‌కి



స్టైలిష్ స్టార్ నుండి ఐకాన్ స్టార్‌గా మారి నేషనల్ అవార్డ్ విన్నర్‌గా ఎదిగిన అల్లు అర్జున్ ఇప్పుడు ఇండియన్ సినిమా హిస్టరీలోనే అత్యంత హైప్ ఉన్న నటులలో ఒకరుగా నిలిచాడు. ప్రతి సినిమాలో తన స్టైల్, యాటిట్యూడ్, డైలాగ్ డెలివరీతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్నాడు.. పుష్ప: ది రైజ్ తర్వాత దేశవ్యాప్తంగా బన్నీ పేరు మార్మోగిపోతోంది. ఇప్పుడు ఆయన చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే నిజంగా ఇండస్ట్రీ షాక్ అవుతోంది. ప్రస్తుతం బన్నీ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో నటించబోతున్నాడు. సన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అట్లీ మాస్ కమర్షియల్ టచ్, బన్నీ ఎనర్జీ కలిస్తే అది దేశవ్యాప్తంగా హవా చేసే సినిమా అవుతుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. కేజీఎఫ్, సలార్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన దర్శకుడు ప్రశాంత్ నీల్తో అల్లు అర్జున్ జట్టు కట్టబోతున్నాడని సమాచారం. రవణం అనే టైటిల్‌తో దిల్ రాజు మధ్యవర్తిత్వంలో ఈ ప్రాజెక్ట్ డిస్కషన్స్ స్టేజ్‌లో ఉన్నట్లు ఫిలిం నగర్ టాక్. ఈ కాంబినేషన్ వస్తే అది హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మహేష్ బాబు ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాత ఎస్.ఎస్. రాజమౌళి అల్లు అర్జున్‌తో సినిమా చేయనున్నాడనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. 'పుష్ప' రేంజ్‌లో యాక్షన్, రాజమౌళి మేకింగ్ కలిస్తే అది ఇండియన్ సినిమాకు కొత్త ప్రమాణాలు సెట్ చేసే మూవీ అవుతుందని అభిమానులు నమ్ముతున్నారు. బాలీవుడ్ మాస్టర్ ఫిల్మ్ మేకర్ సంజయ్ లీలా భన్సాలీతో కూడా బన్నీ స్క్రిప్ట్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పుష్ప తర్వాత వీరిద్దరూ టచ్‌లో ఉన్నారని, భన్సాలీ స్టైల్, అల్లు అర్జున్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే అవార్డ్ రేంజ్ మూవీ అవుతుందని టాక్. ఇక మాస్ ఆడియన్స్‌ను ఉద్దేశించి బోయపాటి శ్రీను దర్శకత్వంలో సరైనోడు 2 రూపుదిద్దుకునే అవకాశముంది. బోయపాటి ఇప్పటికే బేసిక్ ఐడియా రెడీ చేసుకున్నారని, బన్నీ గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం. అలాగే కొరటాల శివ కూడా బన్నీ కోసం కొత్త స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఇంకా అధికారిక ప్రకటనలు వెలువడకపోయినా, అల్లు అర్జున్ ఈ లైనప్‌ను ఫైనల్ చేస్తే ఆయన స్థాయి పాన్ ఇండియా మాత్రమే కాదు , గ్లోబల్ స్టార్ స్థాయికి చేరుకోవడం ఖాయమని అభిమానులు అంటున్నారు.

# అన్‌లిమిటేడ్ ఫన్.. ఫంకీ రిలీజ్ ఎప్పుడంటే?

మాస్ కా దాస్‌గా పేరున్న టాలీవుడ్ హీరో విశ్వక్ సేన్ మాస్ చిత్రాలతో పాటు కామెడీ ఎంటర్‌టైనర్లతోనూ మెప్పించారు. ఈ ఏడాది లైలా అనే రొమాంటిక్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. అయితే ఈ సినిమా అభిమానులను అంతగా మెప్పించలేకపోయింది. ప్రస్తుతం మరో ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో వస్తోన్న మూవీ ఫంకీ ఇప్పటికే టీజర్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ చిత్రంలో కయాద్ లోహర్ హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు వెల్లడించారు. 2026 ఏప్రిల్ 3న సమ్మర్‌లో థియేటర్లలో ఫంకీ సందడి చేయనుందని తెలిపారు. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వీకే నరేశ్, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.







# ప్రభాస్ 'స్పిరిట్'లో దగ్గుబాటి హీరో .. నెట్టింట హాట్ టాపిక్‌గా మారిన రూమర్!

టాలీవుడ్ నుంచి రాబోతున్న పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్స్‌లో ఒకటి 'స్పిరిట్' చిత్రం ఒకటి. రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన సందీప్ ఇప్పుడు ప్రభాస్‌ను ఏ రీతిలో చూపించబోతున్నాడు? అనేది అభిమానుల్లోనే కాదు, మొత్తం సినీ వర్గాల్లోనూ ఎగ్జైట్మెంట్ క్రియేట్ చేస్తోంది. సమాచారం ప్రకారం, చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తయింది. ఇటీవల హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. నిర్మాతలు ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి నటిస్తుండగా, ప్రకాశ్ రాజ్, కాంచన కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక కొరియన్ నటుడు డాన్ లీ కూడా ఈ కథలో భాగమవుతున్నట్టు సమాచారం. సందీప్ సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు ఎప్పటిలాగే ఈసారి కూడా భారీ ప్రాధాన్యం ఉండబోతుందని టాక్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో హాట్ రూమర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, దగ్గుబాటి కుటుంబానికి చెందిన హీరో అభిరామ్ ఈ సినిమాలో ఒక కీలక పాత్రలో నటిస్తున్నాడని ప్రచారం సాగుతోంది. తన పాత్రకు యారోగెన్సీ, ఓవర్ యాటిట్యూడ్, పవర్ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని ఫిల్మ్ సర్కిల్స్ చెబుతున్నాయి. అందుకు అనుగుణంగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్వయంగా అభిరామ్‌ను అప్రోచ్ చేశారని ఇండస్ట్రీ టాక్. అయితే ఈ వార్తపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. దగ్గుబాటి కుటుంబం నుంచి వెంకటేష్, రానా ఇప్పటికే విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తుండగా, అభిరామ్ మాత్రం తన మొదటి చిత్రం 'అహింస' (దర్శకుడు తేజ)తో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఆ సినిమా విడుదలైపోయిందనే విషయం కూడా చాలా మందికి తెలియకపోవడం ఆయన కెరీర్ స్తబ్దతకు కారణమైంది. ఇలాంటి సమయంలో 'స్పిరిట్' లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కితే అది ఆయన కెరీర్‌లో గేమ్‌చేంజర్ అవుతుందనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. సందీప్ వంగా సినిమాల్లో హీరో పాత్రల మాస్ ప్రెజెంటేషన్, ఎమోషనల్ డెప్త్, యాంటగనిస్ట్ పవర్ అన్నీ కలగలిపి ఉంటాయి. అందుకే 'స్పిరిట్'లో ప్రభాస్‌ను కొత్త షేడ్‌లో చూడబోతున్నామనే టాక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఇక అభిరామ్ రోల్ నిజమైతే, ఆ పాత్ర కూడా సినిమాలో ప్రధాన హైలైట్‌గా నిలిచే అవకాశం ఉంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108